ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 158 బుధవారం 27 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 158 Wednesday 27 - 05 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

## అజ్ఞాతంలో తెలంగాణకు చెందిన
# మరో ముగ్గురు మాత్రమే

- తెలంగాణకు చెందిన మరో ముగ్గురు మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారు
- తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్
- పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్ట్ సెంట్రల్ కమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ సంతోశ్
- తెలంగాణకు చెందిన మరో ముగ్గురు మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని వెల్లడి



**వార్త సంధ్య, హైదరాబాద్, మే 26 :** మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ సంతోశ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. భార్య దానమ్మతో కలిసి నరహరి లొంగిపోయారని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. నరహరి హనుమకొండ జిల్లా సోమిడి గ్రామానికి చెందినవారన్నారు. డిగ్రీ చదువుతున్న సమయంలోనే ఉద్యమంలోకి వెళ్లి గోపన్న దళం, రామన్న స్క్వాడ్ దండకారుణ్యంలో పని చేశారని వివరించారు. 1986లో నరహరి కమాండర్‌గా పదోన్నతి పొందగా.. 2017 నాటికి కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగారని సీవీ ఆనంద్ చెప్పారు. తుపాకులు, మోర్టార్లు, రాకెట్లు, గ్రనేడ్ల తయారీలో నరహరి నిపుణుడని డీజీపీ తెలిపారు. 2004లో నరహరి భార్య దానమ్మను అరెస్టు చేశారని సీవీ ఆనంద్ వెల్లడించారు. ఏడు సంవత్సరాల పాటు దానమ్మ జైలులో ఉన్నారని.. అనంతరం బెయిల్‌పై విడుదలై - మిగతా 2 లో

## తెలంగాణ
# గవర్నర్ ను కలిసిన కవిత



- రేవంత్ సర్కారుపై ఫిర్యాదు
- భూసేకరణ బాధితుల సమస్యలపై గవర్నర్‌ను కలిసిన కవిత
- ఖమ్మం, పరిగి, ఆర్‌ఆర్‌ఆర్ బాధితుల సమస్యలను వివరించిన కవిత
- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు
- బాధితులకు న్యాయం జరగకపోతే మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరిక

**వార్త సంధ్య, హైదరాబాద్, మే 26 :** రాష్ట్ర ప్రభుత్వ భూసేకరణ కారణంగా నిరాశ్రయులైన బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్‌ఎస్) అధ్యక్షురాలు కె. కవిత గవర్నర్‌ను కోరారు. మంగళవారం ఆమె ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్, పలువురు బాధితులతో కలిసి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్‌భవన్‌లో కలిశారు. - మిగతా 2 లో




## 3 రోజుల పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

- బండి భగీరథ్ పోక్సో కేసు
- బండి భగీరథ్ 3 రోజుల పోలీసు కస్టడీకి కోర్టు అనుమతి
- బండి భగీరథ్‌ను విచారించనున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు
- పోక్సో కేసులో ఈనెల 16న బండి భగీరథ్ అరెస్టు

# 'మోదీకి నేను చాలా పెద్ద అభిమానిని'

- ప్రధానిపై ట్రంప్ మరోసారి ప్రశంసల జల్లు
- అమెరికాపై భారత్ పూర్తిగా ఆధారపడవచ్చని ట్రంప్ వెల్లడి
- అమెరికా అధ్యక్షుడి ట్రంప్ వ్యక్తిగత సందేశం వివరాలను 'ట్రూత్ సోషల్'లో పంచుకున్నారు




**వార్త సంధ్య, ఢిల్లీ, మే 26 :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై మరోసారి ప్రశంసల జల్లు కురిపించారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ప్రధాని మోదీకి తాను పెద్ద అభిమానిని అన్నారు. అమెరికాపై భారత్ పూర్తిగా ఆధారపడవచ్చని ట్రంప్ అభిప్రాయపడ్డారు. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్‌ను ఆయన రీట్వీట్ చేశారు. దీంతో పాటు ఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మండపంలో జరిగిన అమెరికా స్వాతంత్ర్య 250వ వార్షికోత్సవ వేడుకలకు సంబంధించిన ఒక వీడియో క్లిప్‌ను కూడా జతచేశారు. అమెరికా అధ్యక్షుడి ట్రంప్ వ్యక్తిగత సందేశం వివరాలను 'ట్రూత్ సోషల్'లో పంచుకున్నారు. ఇందులో "అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాకు ఫోన్ చేశారు. ఆయన ఒక స్పష్టమైన సందేశం ఇచ్చారు. 'నేను ప్రధానమంత్రి మోదీని ప్రేమిస్తున్నాను. మనం భారతదేశానికి ఇంతకంటే దగ్గరగా ఎప్పుడూ లేము. నేను ప్రధానమంత్రి మోదీకి పెద్ద అభిమానిని.'అని ట్రంప్ చెప్పి"నట్లు గోర్ పేర్కొన్నారు.భారత్ మండపంలో జరిగిన అమెరికా స్వాతంత్ర్య 250వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ట్రంప్ ఫోన్ సందేశాన్ని కొత్తగా నియమితులైన అమెరికా రాయబారి వినిపించారు. "అందరికీ నమస్కారం. నేను ప్రధానమంత్రిని ప్రేమిస్తున్నాను. నరేంద్ర మోదీ గొప్పవారు, ఆయన నా స్నేహితుడు. నేను ప్రధానమంత్రి మోదీకి పెద్ద అభిమానిని. - మిగతా 2 లో

# మోదీ సర్కార్‌కు 12 ఏళ్లు

- 'విజయాల' ప్రచారానికి బీజేపీ భారీ ప్రణాళిక
- కేంద్రంలో మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంకు 12 ఏళ్లు పూర్తి
- దేశవ్యాప్తంగా '22 విజయాలు' ప్రచారం చేసేందుకు బీజేపీ ప్రణాళిక
- ఇది సుపరిపాలన, అభివృద్ధి ప్రస్థానంగా అభివర్ణించిన కమలదళం
- 'విధానాల పక్షవాతం' నుంచి దేశం బయటపడిందని కేంద్ర మంత్రుల వ్యాఖ్య
- వికసిత భారత్ లక్ష్యానికి ఈ 12 ఏళ్ల పాలనే పునాది అని స్పష్టీకరణ



## బంగ్లాదేశీ చొరబాటుదారులు తక్షణమే పారిపోండి

- పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి
- బంగ్లాదేశ్ అక్రమ వలసదారులకు సువేందు అధికారి డెడ్లీ వార్నింగ్
- మిమ్మల్ని జైళ్లలో పెట్టి, తిండి పెట్టి పోషించడం మాకు ఇష్టం లేదని వ్యాఖ్య
- చొరబాటుదారులను గుర్తించేందుకు రెడీ అవుతున్న యాక్షన్ ప్లాన్

**వార్త సంధ్య, ఢిల్లీ, మే 26 : :** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో, అంతర్గత భద్రతా వ్యవహారాలలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీ వలసదారులకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి కఠిన హెచ్చరికలు జారీ చేశారు. అక్రమ చొరబాటుదారులను ఏరిపారేసే చర్యలను ముమ్మరం చేయాలని ఆయన అధికారులను ఆదేశిస్తూ.. "బంగ్లాదేశీ చొరబాటుదారులు ఎవరైనా ఉంటే వేగంగా ఇక్కడి నుంచి పారిపోండి. మిమ్మల్ని జైళ్లలో పెట్టి, మా ప్రజాధనంతో తిండి పెట్టి పోషించడం మాకు ఎంతమాత్రం ఇష్టం లేదు. మా డబ్బును ఎందుకు వృథా చేయాలి" అంటూ సంచలన వ్యాఖ్యలు - మిగతా 2 లో



## పుణ్యం మాట దేవుడెరుగు రోగాలు మాత్రం కచ్చితంగా వస్తాయి

- రాజమండ్రిలో పుష్కర ఏర్పాట్లను పరిశీలించిన పవన్
- గోదావరిలో కాలుష్య పరిస్థితిపై స్వయంగా తనిఖీలు
- ఆంధ్ర పేపర్ మిల్స్ వ్యర్థాలు నదిలో కలిసే ప్రాంతానికి బోటులో వెళ్లిన పవన్

**వార్త సంధ్య, అమరావతి, మే 26 :** రాజమండ్రిలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రెండో రోజు కూడా క్షేత్రస్థాయిలో కాలుష్య పరిస్థితిపై తనిఖీలు - మిగతా 2 లో

## రాజమండ్రిలో పవన్ కల్యాణ్‌ను కలిసిన టాలీవుడ్ నిర్మాతలు



- రాజమండ్రిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో టాలీవుడ్ నిర్మాతల సమావేశం
- సింగిల్ స్క్రీన్ థియేటర్ల సమస్యలను పవన్ దృష్టికి తీసుకెళ్లిన నిర్మాతలు
- విద్యుత్ ఛార్జీల రాయితీ, కొత్త ఫిలిం పాలసీ తీసుకురావాలని విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన పవన్.. మంత్రి కందుల దుర్గేష్‌కు తక్షణ ఆదేశాలు!

**వార్త సంధ్య, అమరావతి, మే 26 :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మంగళవారం రాజమండ్రిలో పలువురు ప్రముఖ టాలీవుడ్ నిర్మాతలు కలిశారు. పర్యటనలో భాగంగా నగరంలోని షెల్టన్ హోటల్‌లో బస చేసిన పవన్‌తో వారు సమావేశమై సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో - మిగతా 2 లో

## అధికారుల తీరుపై
# సీఎం సీరియస్

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- బాగా పనిచేస్తే ప్రశంసలు
- నిర్లక్ష్యం వహిస్తే ఓరియంటేషన్ క్లాసులు
- నిబంధనల పేరుతో ఫైళ్లను తొక్కిపెడతామంటే కుదరదు
- ఆర్టీజీఎస్ సమీక్షలో అధికారుల తీరుపై సీఎం సీరియస్
- నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి ఓరియంటేషన్ క్లాసులు



**వార్త సంధ్య, అమరావతి, మే 26 :** సాంకేతిక పరిజ్ఞానం అందరికీ పూర్తిగా అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో నిబంధనల పేరుతో ఫైళ్లను నిలిపివేయడం ఆమోదయోగ్యం కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వ పరిపాలన వేగాన్ని పెంచే లక్ష్యంతో ఆయన కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన రియల్-టైమ్ గవర్నెన్స్ సిస్టమ్ (ఆర్‌టీజీఎస్) ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో అధికారుల వైఖరి పట్ల ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పనుల్లో అధికారులు చురుకుగా పని చేయాలని నిర్ణయించిన సమయంలోపు పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సేవలు ప్రజలకు మరింత వేగంగా చేరేలా కాలం చెల్లిన ప్రభుత్వ నిబంధనలను - మిగతా 2 లో

# సంపాదకీయం

## సమాజానికి 'పోక్సో' ఓ హెచ్చరిక!




ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటన వంటివి భవిష్యత్తులో జరగకూడదని 2013లో కేంద్ర ప్రభుత్వం పోక్సో చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. కానీ ప్రతి లక్ష మంది చిన్నారుల్లో 15.6 మంది పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే లైంగిక నేరాలకు గురవుతున్నారనీ, ఏటికేడాది ఈ చట్టం కింద నమోదయ్యే కేసులు కూడా పెరుగుతున్నాయని జాతీయ నేర నమోదు విభాగం(ఎన్సీఆర్బీ) ఈ మధ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఒక్క 2024లోనే దేశం మొత్తం మీద 69,191 పోక్సో కేసులు నమోదైతే, వారిలో తీవ్ర లైంగిక దాడులకు గురైన బాలికల సంఖ్య 43,675. కాగా ఈ బాధితుల్లో 16--18 ఏళ్ల బాలికలు 24,000 మందికి పైనే ఉన్నారు. ప్రతి పోక్సో కేసు వెనుక ఛిద్రమైన ఒక చిన్నారి జీవితమే కాదు, వ్యవస్థాగత లోపమూ కచ్చితంగా ఉంది. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో వెలుగులోకి వచ్చిన రెండు వరుస ఘటనలు నేటి కాలంలో పిల్లల భద్రతా లోపాలను మరోసారి ఎత్తిచూపుతున్నాయి. అదేవిధంగా సమాజానికి ప్రమాద సంకేతాలనూ పంపుతున్నాయి.హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన సంఘటన, అలాగే ఒంగోలుకు చెందిన ఒక మహిళా ప్రత్యేక అధికారిణి పోక్సో కేసులో జైలుకు వెళ్లడం వంటి సంఘటనలను కేవలం వ్యక్తిగత ఘటనలుగా చూడకూడదు. ఇవి సమాజంలో పెరుగుతున్న ప్రమాదకర ధోరణికి హెచ్చరికలు. విలువల సంక్షోభానికి, అధికార వ్యవస్థల్లో ఏర్పడుతున్న నైతిక పతనానికి ఇవి స్పష్టమైన సంకేతాలు. చాలావరకూ పోక్సో కేసుల్లో బాధితులు తమకు తెలిసిన వ్యక్తుల చేతుల్లో లైంగిక దాడులకు గురవుతున్నారు.అసలు ఎందుకు ఇటువంటి ఘటనలు పెరుగుతున్నాయి? ఇది కేవలం చట్టవ్యవస్థ వైఫల్యమా? లేక సమాజం మొత్తం నెమ్మదిగా ఒక అనాసక్తి, నైతిక గందరగోళం వైపు జారిపోతుందా? ఇలాంటి ఘటనలు బయటపడినప్పుడల్లా మన సమాజం రెండు ప్రమాదకరమైన ప్రతిస్పందనలు చూపుతోంది. ఒకటి-- ఇవి రాజకీయంగా తయారు చేసిన కేసులు కావచ్చు అని. రెండోది-- రెండు రోజులు చర్చించి మర్చిపోవడం. ఈ రెండు ధోరణులూ ప్రమాదకరమే. ఇప్పుడు అవసరమైంది కేవలం చట్టాలు సక్రమంగా అమలు కావడం ఒక్కటే కాదు. వాటి గురించి బాలలకు అవగాహన కల్పించడం, బాధ్యతాయుతమైన వ్యక్తులుగా మెలిగేలా, తమని తాము కాపాడుకునేలా చూడటం కూడా ఎంతో అవసరం.ఇప్పుడు నేరాల తీరు మారుతోంది. 'డిజిటల్ గ్రూమింగ్' అనే కొత్త ముప్పు పిల్లలను మరింత ప్రమాదంలోకి నెడుతోంది. సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లు, ప్రైవేట్ చాట్స్, గేమింగ్ ప్లాట్‌ఫారాలు-- నేరస్తులకు పిల్లల వరకు చేరుకునే మార్గాలుగా మారుతున్నాయి. పిల్లలు ఏం చూస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? అనే విషయంలో కుటుంబాల్లో పర్యవేక్షణ తగ్గిపోవడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తోంది. అలానే వెబ్ సిరీస్‌లు, సినిమాల్లోని మితిమీరిన నేర, అశ్లీల దృశ్యాలు యువతపై వికృత ప్రభావం చూపుతున్నాయి. వాటి ప్రేరణతో అకృత్యాలకు, నేరాలకు పాల్పడుతున్న మైనర్లు, యువత సంఖ్య కూడా ఇటీవల అధికమవుతోంది. చాలా మంది చిన్నారులు తమపై జరిగిన దాడిని బయటకు చెప్పలేకపోతున్నారు. ఎందుకంటే అది లైంగిక దాడి అని తెలియకపోవడం, మరొకటి భయం. 'కుటుంబ పరువు పోతుంది' అనే మానసిక ఒత్తిడి వారిని మౌనంలోకి నెడుతోంది. చాలా విద్యాసంస్థల్లో చైల్డ్ ప్రొటెక్షన్ మెకానిజం కేవలం పత్రాలకే పరిమితం అవుతోంది. పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి చాలా చోట్ల స్పష్టమైన అవగాహన ఇవ్వడం లేదు. స్కూల్ కౌన్సిలర్లు, ఫిర్యాదు వ్యవస్థలు సక్రమంగా లేకపోవడంతో పిల్లలకు తమ సమస్యలను చెప్పుకునే అనువైన వాతావరణం విద్యాసంస్థల్లో కరువవుతోంది.పిల్లలకు మొదటి గురువులు తల్లిదండ్రులే. కాబట్టి వాళ్లని వాళ్లు కాపాడుకోవడంతో పాటు సమాజంలో ఉత్తమ పౌరుడిగా ఎదిగేందుకు రెక్కలు ఇవ్వాలి. తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడటమేకాక, స్వేచ్ఛగా ప్రతి విషయం పంచుకునే సమయాన్నీ చొరవనీ కల్పించాలి. ఎన్ని తలమునకలయ్యే బాధ్యతలు ఉన్నా పిల్లల్ని ఓ కంట గమనిస్తూ ఉండాలి. వారి భావోద్వేగాల్ని, భయాల్ని చెప్పకుండానే అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి.స్కూళ్లలో నైతిక విలువల పట్ల విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించాలి. అందుకోసం చదువుల్ని సంస్కరించాలి. విద్యాసంస్థల యాజమాన్యాలు సైతం విద్యార్థులను నిశితంగా గమనించాలి. ప్రతి స్కూల్‌లోనూ పిల్లల భద్రతతో పాటు, పోక్సో చట్టం గురించి అవగాహన తరగతులు నిర్వహించాలి. పిల్లలకు సైబర్ నేరాలతోపాటు, చట్టాలు, శిక్షల గురించి కూడా తెలియజెప్పాలి. మీడియాలో నిరంతరం వచ్చే విషయాలను వారి దృష్టికి తేవడంతో పాటు పర్యవసానాలను వివరించి చెప్పాలి. స్కూళ్లలోనే కాదు, గేటెడ్ కమ్యూనిటీల నుంచి గ్రామవార్డుల వరకూ దీనిని చర్చించదగిన అంశంగా పరిగణించి ప్రభుత్వంతో పాటు ఎన్జీవోలు కూడా సామాన్యుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు నడుం బిగించాలి. పోక్సో చట్టం గురించి చెప్పడంతో పాటు అన్యాయం జరిగిన వెంటనే ఫిర్యాదు చేసే ధోరణిని అలవాటు చేయాలి. ఈ విషయం మనం సీరియస్‌గా తీసుకోకపోతే, రేపటి తరానికి భద్రమైన బాల్యం ఇవ్వలేం.

## రాజమండ్రిలో పవన్ కల్యాణ్‌ను కలిసిన టాలీవుడ్ నిర్మాతలు

**మొదటిపేజీ తరువాయి -** మైత్రీ మూవీ మేకర్స్ అధినేత వై. రవిశంకర్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ, షైన్ స్క్రీన్స్ నిర్మాత సాహు గారపాటి, కిలారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.రాష్ట్రంలో సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్ని నిర్మాతలు పవన్ కల్యాణ్‌కు వివరించారు. థియేటర్ యాజమానులు, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలకు మధ్య ఆదాయ పంపకాల (రెవెన్యూ షేరింగ్) విషయంలో నెలకొన్న వివాదాలతో పరిశ్రమ తీవ్రంగా నష్టపోతోందని తెలిపారు. అధిక విద్యుత్ ఛార్జీలు, నిర్వహణ వ్యయంతో చాలా థియేటర్లు మూసివేత అంచున ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం జోక్యం చేసుకుని, పరిశ్రమకు అండగా నిలవాలని నిర్మాతలు కోరారు. సింగిల్ స్క్రీన్ థియేటర్ల మనుగడ కోసం ప్రత్యేకంగా ఒక నూతన ఫిలిం పాలసీని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. థియేటర్లకు విద్యుత్ బిల్లులపై రాయితీలు కల్పించాలని కోరారు.నిర్మాతలు చెప్పిన సమస్యలను సానుకూలంగా విన్న పవన్ కల్యాణ్, తెలుగు సినీ పరిశ్రమ సమస్యల పరిష్కారానికి తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన ఆయన, రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. విద్యుత్ రాయితీలపై వచ్చిన ప్రతిపాదనలను వెంటనే పరిశీలించి నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పవన్ సానుకూల స్పందనతో త్వరలోనే తమ సమస్యలు పరిష్కారమవుతాయని టాలీవుడ్ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## పుణ్యం మాట దేవుడెరుగు

**మొదటిపేజీ తరువాయి -** చేపట్టారు. వెంకటనగరం సమీపంలోని ఆంధ్ర పేపర్ మిల్స్ నుంచి పారిశ్రామిక వ్యర్థాలు నదిలో కలిసే ప్రాంతాన్ని ఆయన బోటులో వెళ్లి స్వయంగా పరిశీలించారు. అక్కడ అధికారులతో నీటి నమూనాలను (శాంపిల్స్) సేకరింపజేశారు. ఈ సందర్భంగా పవన్ తో పాటు మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ కూడా ఉన్నారు.ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. "పవిత్ర గోదావరిలో పారిశ్రామిక వ్యర్థాలు కలవడం దారుణం. పుష్కరాల వేళ ఈ నీటిలో స్నానం చేస్తే పుణ్యం మాట దేవుడెరుగు... రోగాలు మాత్రం కచ్చితంగా వస్తాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏలూరులో తాగునీటి కాలుష్యం కారణంగా జరిగిన ప్రమాదాలను గుర్తు చేస్తూ, రాష్ట్ర ప్రగతికి పరిశ్రమలు ఎంత అవసరమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ కాలుష్య సమస్యపై త్వరలోనే అసెంబ్లీ, కేబినెట్ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. పుష్కరాల రేవులను కేవలం అందంగా తీర్చిదిద్దడమే కాదు, నది కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉందని మంత్రి కందుల దుర్గేష్‌ను ఉద్దేశించి పవన్ అన్నారు. పేపర్ మిల్స్ కాలుష్యంపై తాము నిఘా ఉంచామని, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు.

## 'మోదీకి నేను చాలా పెద్ద అభిమానిని'

**మొదటిపేజీ తరువాయి -** మనం భారతదేశానికి ఇంతకంటే దగ్గరగా ఎప్పుడూ లేము. భారతదేశం నాపై, మన దేశంపై 100 శాతం ఆధారపడవచ్చు. వారికి ఎప్పుడైనా సహాయం అవసరమైతే, ఎక్కడికి ఫోన్ చేయాలో వారికి తెలుసు. వారు సరిగ్గా ఇక్కడికే ఫోన్ చేస్తారు. ప్రధానమంత్రి మోదీకి నమస్కారం. నేను మీ పెద్ద అభిమానినని ఆయనకు తెలపండి" అంటూ ట్రంప్ తన టెలిఫోన్ ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తన రాయబారులను ట్రంప్ ప్రశంసించారు. మార్కో రూబియోను అమెరికా చరిత్రలోనే గొప్ప విదేశాంగ మంత్రిగా అభివర్ణించారు. భారత్ మండపంలో జరిగిన కార్యక్రమానికి భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, భారత్‌లో అమెరికా రాయబారి గోర్‌తో పాటు పలువురు దౌత్యవేత్తలు పాల్గొన్నారు.

# 'మోదీకి నేను చాలా పెద్ద అభిమానిని'



**మొదటిపేజీ తరువాయి -** ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నిన్నటితో 12 సంవత్సరాలు పూర్తయింది. ఈ దశాబ్ద కాలానికి పైబడిన ప్రస్థానాన్ని సుపరిపాలన, అభివృద్ధి, జాతీయ పరివర్తనకు చిరునామాగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభివర్ణించింది. ఈ మైలురాయిని పురస్కరించుకుని, దేశవ్యాప్తంగా భారీ ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తమ ప్రభుత్వం సాధించిన '22 ముఖ్యమైన విజయాలను' ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు కేంద్ర మంత్రులు, బీజేపీ ముఖ్యమంత్రులు, ఎంపీలు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.ఈ 12 ఏళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, ఆర్థిక సంస్కరణలు, డిజిటల్ పాలన, విదేశాంగ విధానంలో సాధించిన విజయాలు, సామాజిక రంగంలో చేపట్టిన కార్యక్రమా లను ఈ ప్రచారం ద్వారా ప్రజలకు వివరించనున్నారు.ఈ సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ 12 ఏళ్ల ప్రస్థానాన్ని 'సంకల్పం నుంచి సాఫల్యం వరకు' సాగిన యాత్రగా అభివర్ణించారు. "2014 మే 26న ప్రారంభమైన ఈ శకం కేవలం ప్రభుత్వ మార్పు కాదు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం తిరిగి పొందిన ఆత్మవిశ్వాసం, సాంస్కృతిక పునరుజ్జీవనానికి చారిత్రక ఘట్టం" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' అనే మంత్రంతో పాటు అంత్యోదయ స్ఫూర్తితో ప్రభుత్వం పాలన సాగించిందని, సామాన్యుడి జీవితంలో మార్పు తెచ్చిందని అన్నారు. 'వికాస్ భీ, విరాసత్ భీ' (అభివృద్ధి, వారసత్వం) రెండింటినీ సమతుల్యం చేశారని, ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపడం ద్వారా దేశం ఇప్పుడు మరింత సురక్షితంగా ఉందని తెలిపారు. 2047 నాటికి 'వికసిత భారత్' నిర్మాణానికి ఈ 12 ఏళ్ల పాలనే బలమైన పునాది అని ఆయన పేర్కొన్నారు.రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందిస్తూ.. 2014 మే 26న భారతదేశ అభివృద్ధి, నాగరిక ప్రస్థానంలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైందని అన్నారు. "ఆర్థికాభివృద్ధి, సామాజిక సంక్షేమం నుంచి ఆత్మనిర్భర్ భారత్, డిజిటల్ పరివర్తన వరకు, మౌలిక సదుపాయాల నుంచి బలమైన జాతీయ భద్రత వరకు ప్రతి రంగంలోనూ దేశం అపూర్వమైన వేగంతో పురోగమించింది" అని ఆయన వ్యాఖ్యానించారు. దేశ వృద్ధి ఇప్పుడు మరింత విస్తృతమైనదిగా, సమ్మిళితమైనదిగా మారిందన్నారు. దశాబ్దాలుగా తెరమరుగైన కోట్లాది మంది ప్రజలు దేశాభివృద్ధిలో భాగస్వాములయ్యారని, మోదీ ఒక నిజమైన 'ప్రధాన్-సేవక్' అని కొనియాడారు.కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. గడిచిన 12 ఏళ్లు సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమానికి అంకితమైనవని అన్నారు. ఒకప్పుడు దేశం ఎదుర్కొన్న 'విధానాల పక్షవాతం' నుంచి బయటపడి 'సంస్కరణ, పనితీరు, పరివర్తన' మంత్రంతో ముందుకు సాగుతోందని చెప్పారు. ఈ కాలాన్ని భారతదేశ పునర్నిర్మాణానికి, ప్రజా సంక్షేమానికి ఒక 'స్వర్ణయుగం'గా అభివర్ణించారు. జన్ ధన్ ఖాతాల నుంచి ఆయుష్మాన్ భారత్ వరకు, పీఎం ఆవాస్ యోజన నుంచి డిజిటల్ ఇండియా వరకు ఎన్నో పథకాలతో ప్రధాని మోదీ అభివృద్ధి, సంక్షేమాలలో కొత్త అధ్యాయాన్ని లిఖించారని ప్రశంసించారు.

## అధికారుల తీరుపై సీఎం సీరియస్



**మొదటిపేజీ తరువాయి -** సవరించడానికి తక్షణమే ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సీఎం ఆదేశించారు. బాగా పనిచేసే అధికారులను ప్రశంసిస్తామని నిర్లక్ష్యంగా వ్యవహరించే వారు ఓరియెంటేషన్ తరగతులకు హాజరు కావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి శాసనసభ నియోజకవర్గానికి నియమించిన నోడల్ అధికారుల సేవలను పూర్తిగా వినియోగించుకోవాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఏడాదిలోగా రెవెన్యూ సంబంధిత సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చిందని అయితే ఆ సమయం ఇప్పటికే గడిచిపోయిందని ఆయన అధికారులకు గుర్తు చేశారు. ముఖ్యంగా కుటుంబ కలహాల కారణంగా నిలిచిపోయిన భూ వివాదాలను మానవతా దృక్పథంతో కౌన్సెలింగ్ అందించడం ద్వారా పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కుల ధృవీకరణ పత్రాలు పొందడానికి విద్యార్థులు, సాధారణ ప్రజలు ఇకపై ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ ధృవీకరణ పత్రాలను వారు నేరుగా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలుగా నిబంధనలు రూపొందించాలని ఆయన ఆదేశించారు.సైబర్ నేరాలను అరికట్టడానికి పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆర్‌టీజీఎస్‌తో సమర్థవంతమైన సమన్వయం ఉండేలా ప్రతి ప్రభుత్వ శాఖలో ఒక ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణకు యాక్షన్ ప్లాన్ రూపకల్పనపై చర్చించారు. సైబర్ నేరగాళ్లు ఇతరుల బ్యాంకు ఖాతాలను దుర్వినియోగం చేయకుండా నిరోధించే చర్యలు 'గోల్డెన్ అవర్' భావన సైబర్ విధానం, ఇతర సంబంధిత అంశాలపై చర్చలు జరిగాయి. వీటన్నిటినీ కచ్చితంగా అమలు చేసే విధంగా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, పలువురు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశీ చొరబాటుదారులు తక్షణమే పారిపోండి



**మొదటిపేజీ తరువాయి -** చేశారు.బీజేపీ ప్రధాన ఎన్నికల హామీలలో ఒకటైన అక్రమ వలసదారుల ఏరివేతపై ఇప్పుడు సువేందు సర్కార్ పూర్తిస్థాయిలో యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా చొరబాటుదారులను గుర్తించి, వారిని నిర్బంధించడానికి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అక్రమంగా ఉంటున్న బంగ్లాదేశీయులతో పాటు రోహింగ్యాలను కూడా కచ్చితంగా గుర్తించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి. ఈ మేరకు బెంగాల్‌లోని అన్ని జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి లిఖితపూర్వక మార్గదర్శకాలు జారీ అయ్యాయి. నిర్బంధ కేంద్రాల ఏర్పాటు కోసం అనువైన స్థలాలను తక్షణమే అన్వేషించాలని జిల్లా యంత్రాంగాలను ఆదేశించారు.ముఖ్యమంత్రి సువేందు అధికారి ఇచ్చిన ఈ గట్టి వార్నింగ్‌తో పశ్చిమ బెంగాల్ సరిహద్దు జిల్లాలైన ఉత్తర 24 పరగణాలు, మాల్దా వంటి ప్రాంతాలలో అప్పుడే చలనం మొదలైంది. చాలామంది అక్రమ వలసదారులు తమ సొంత దేశానికి తిరిగి వెళ్ళిపోవడానికి సరిహద్దుల వైపునకు కదులుతున్నట్టు నివేదికలు చెబుతున్నాయి. పట్టుబడిన చొరబాటుదారుల గుర్తింపును నిర్ధారించిన తర్వాత, చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి వారిని తిరిగి బంగ్లాదేశ్ పంపివేయడానికి ప్రభుత్వం సర్వసిద్ధం అవుతోంది. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా మరోసారి అక్రమ వలసల అంశంపై పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది.

# తెలంగాణ గవర్నర్ ను కలిసిన కవిత



**మొదటిపేజీ తరువాయి -** ఈ సందర్భంగా ఆయనకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతకు గురైన బాధితులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని, పరిగి మండలం కడ్లాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం జారీ చేసిన భూసేకరణ నోటీసును రద్దు చేయాలని వారు గవర్నర్‌ను కోరారు. అలాగే, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ మార్పు, ఇతర భూసేకరణ సమస్యలను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.గవర్నర్‌తో భేటీ అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహిళల ఇళ్లను కూల్చివేస్తున్నారని, రేవంత్ రెడ్డి ఒక నిర్దయుడైన ముఖ్యమంత్రి అని, కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గమైన పాలన అందిస్తోందని ఆమె విమర్శించారు. వంద రూపాయల చీరలు పంచి బాధితులను లక్షాధికారులను చేశానని సీఎం అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు.తమ పోరాటాల ఫలితంగా వెలుగుమట్ల బాధితులకు అదే స్థలంలో భూమి కేటాయించడానికి ప్రభుత్వం అంగీకరించిందని, పరిగి, ఆర్ఆర్ఆర్ భూసేకరణ ప్రక్రియలను నిలిపివేసిందని కవిత తెలిపారు. ఇవి పాక్షిక విజయాలని, సంపూర్ణ న్యాయం కోసం కేంద్రం ప్రమేయం అవసరమని, అందుకే గవర్నర్‌ను కలిశామన్నారు. గవర్నర్ సానుకూలంగా స్పందించారని, అన్ని అంశాలపై నివేదిక తెప్పించుకుని న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. బాధితులకు న్యాయం జరగని పక్షంలో మరోసారి ఉద్యమబాట పడతామని ఆమె హెచ్చరించారు.

## అజ్ఞాతంలో తెలంగాణకు చెందిన మరో ముగ్గురు మాత్రమే




**మొదటిపేజీ తరువాయి -** మళ్లీ మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్లారని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం సాయం అందిస్తోందన్న డీజీపీ.. అజ్ఞాతంలో ఉన్నవారు జనజీవన స్రవంతిలోకి రావాలని సూచించారు.మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ తగిలిందన్న సీవీ ఆనంద్ అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలని కోరారు. మావోయిస్టు కార్యకలాపాలను నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయని అన్నారు. తెలంగాణకు చెందిన మరో ముగ్గురు మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని, గణపతి, జాడే సుజాత, వార్త శేఖర్ మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం సాయం అందిస్తోందని పేర్కొన్నారు."మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ తగిలింది. సెంట్రల్ కమిటీ సభ్యుడు పసునూరి నరహరి లొంగిపోయారు. భార్య దానమ్మతో కలిసి పసునూరి నరహరి లొంగిపోయారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి. తెలంగాణకు చెందిన మరో ముగ్గురు మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారు. గణపతి, జాడే సుజాత, వార్త శేఖర్ మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం సాయం అందిస్తోంది"

## 3 రోజుల పోలీసు కస్టడీకి బండి భగీరథ్



**మొదటిపేజీ తరువాయి -** పోక్సో కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌ని 3 రోజులపాటు కస్టడీకి మల్కాజిగిరి కోర్టు అనుమతించింది. బండి భగీరథ్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసులు విచారించనున్నారు. బండి భగీరథ్‌ను వారం పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరినా, మూడు రోజులు మాత్రమే కస్టడీకి మల్కాజిగిరి న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. పోక్సో కేసులో ఈనెల 16న అరెస్టైన భగీరథ్.. ప్రస్తుతం చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

## రాజాసింగ్‌కు సైబర్ కేటుగాడి ఫేక్ కాల్.. ప్రమాదం నుంచి తప్పించుకున్న రాజాసింగ్!



సెలబ్రిటీల నుండి సామాన్యుల వరకు చాలామందిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను లక్ష్యంగా చేసుకుని కుచ్చుటోపీ పెట్టేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వ ఉన్నతాధికారిగా పరిచయం చేసుకుని ఒక గుర్తు తెలియని వ్యక్తి మోసానికి తెరలేపగా, అప్రమత్తమైన రాజాసింగ్ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ ఫేక్ కాల్ ఉదంతంపై ఆయన స్వయంగా ఒక వీడియోను విడుదల చేసి వివరాలు వెల్లడించారు.రాజాసింగ్ తెలిపిన వివరాల ప్రకారం... నిన్న సాయంత్రం ఆయనకు ఒక గుర్తు తెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ సెక్రటరీ దిలీప్ కుమార్‌ని అంటూ పరిచయం చేసుకున్నాడు. "ప్రధాన మంత్రి వికసిత్ భారత్" పథకం కింద తెలంగాణలో ప్రతి నియోజకవర్గానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయని, దీని ద్వారా నియోజకవర్గ యువతకు 50 శాతం సబ్సిడీతో రూ.10 లక్షల రుణాలు ఇస్తామని నమ్మబలికాడు. అన్నింటిలో ముందుండే మీరు ఈ స్కీమ్‌కు ఎందుకు అప్లై చేయలేదని ప్రశ్నిస్తూ.. ఇవాళ రాత్రిలోపే ఆధార్ కార్డ్ వివరాలు పంపాలని ఒత్తిడి చేశాడు.ఈ గడువు విధింపుతో అనుమానం వచ్చిన రాజాసింగ్... వెంటనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీఏకు ఫోన్ చేసి క్రాస్ చెక్ చేసుకున్నారు. ఆర్థిక శాఖలో దిలీప్ కుమార్ అనే అధికారి ఎవరూ లేరని, అసలు అలాంటి స్కీమే లేదని తేలడంతో అది ఫేక్ కాల్ అని నిర్ధారించుకున్నారు. నియోజకవర్గ ప్రగతి కోసమని ఆశపడి ప్రజాప్రతినిధులు ఇలాంటి మోసాల బారిన పడే ప్రమాదం ఉందని, రెండు తెలుగు రాష్ట్రాల ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండాలని రాజాసింగ్ హెచ్చరించారు. ఈ సైబర్ నేరగాడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

## "తెలంగాణ ఉద్యమకారులందరికీ ప్రభుత్వం న్యాయం చేయాలి"

"కేసులు ఎదుర్కొన్న ఉద్యమకారులను కూడా గుర్తించాలి"

"బలిదాన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలి"

"కేకే కమిటీలో డాక్టర్ పిడమర్తి రవికి అవకాశం ఇచ్చి ఉంటే బాగుండేది"

"ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి"

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా నాగేశ్వరావు వ్యాఖ్య



**ఖమ్మం జిల్లా బ్యూరో, మే 26 (వార్త సంధ్య) :** మంగళవారం ఖమ్మంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల సంఘం సమావేశంలో మలిదశ ఉద్యమకారుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా నాగేశ్వరావు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన తొలి దశ, మలిదశ ఉద్యమకారులందరినీ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించి, వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన కోరారు. కేకే కమిటీలో డాక్టర్ పిడమర్తి రవిని సభ్యుడిగా తీసుకుంటే మరింత బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఉద్యమ సమయంలో కేసులు ఎదుర్కొని వారినీ గుర్తించి వారికి కూడా న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ కోసం బలిదానాలు చేసుకున్న కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూక్యా నాగేశ్వరావు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రయాణ మధ్యలోనే ఆర్టీసీ కండక్టర్‌కు గుండెపోటు

టికెట్లు ఇస్తుండగానే కుప్ప కూలిన శంకర్

అనిశెట్టిపల్లి బ్రిడ్జి వద్ద విషాద ఘటన

108 లో ఆసుపత్రికి తరలించిన ఫలితం లేకపోయింది

కన్నీటి పర్యంతమైన ప్రయాణికులు



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 26 (వార్త సంధ్య) :** భద్రాచలం నుండి హనుమకొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో విషాద ఘటన చోటు చేసుకుంది. విధులు నిర్వహిస్తున్న కండక్టర్‌కు ఆకస్మికంగా గుండెపోటు రావడంతో ఆయన మృతి చెందారు. ఈ ఘటనతో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది విషాదంలో మునిగిపోయారు. సమాచారం మేరకు.. పరకాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం భద్రాచలం నుండి హనుమకొండ వైపు బయలుదేరింది. బస్సు పాల్వంచ సమీపంలోని అనిశెట్టిపల్లి బ్రిడ్జి వద్దకు చేరుకున్న సమయంలో కండక్టర్ బిరిల్లి శంకర్ ప్రయాణికులకు టికెట్లు జారీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా అస్వస్థతకు గురైన ఆయన బస్సులోనే కుప్పకూలిపోయారు. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే బస్సును ఆపగా, ప్రయాణికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం శంకర్‌ను సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే తీవ్ర గుండెపోటుతో ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కొద్ది క్షణాల క్రితం వరకు ప్రయాణికులతో మాట్లాడిన కండక్టర్ ఆకస్మికంగా మృతి చెందడంతో బస్సులో విషాద వాతావరణం నెలకొంది. ఈ ఘటన పరకాల డిపో ఆర్టీసీ సిబ్బందిని కలచివేసింది. శంకర్ మృతి వార్త తెలిసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## తెలంగాణ పిసిసి అధ్యక్షులు బి మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్సీ అధ్యక్షులు ని మర్యాదపూర్వకంగా కలిసి పూల బోకే ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు



హైదర్ గూడ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో కలవడం జరిగింది

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 26 :** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి సయ్యద్ ఫసి హుస్సేన్ కలిశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన కోరారు టిపిసిసిఅధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన అన్నారు

## ఆర్టీసీ ఆసుపత్రికి ఫ్రీజ్ అందజేత

తల్లి జ్ఞాపకార్థంగా సేవా కార్యక్రమం

రోగుల అవసరాల కోసం ముందుకొచ్చిన ఆర్టీసీ డ్రైవర్

సామాజిక సేవలో ఆదర్శంగా నిలిచిన సి.ఎల్. కాంత్



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 26 (వార్త సంధ్య) :** ఆర్టీసీ డ్రైవర్ సి.ఎల్. కాంత్ తన తల్లి జ్ఞాపకార్థంగా కొత్తగూడెం ఆర్టీసీ ఆసుపత్రికి ఫ్రీజ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఆసుపత్రి డాక్టర్ వేణుగోపాల్ గారికి ఫ్రీజ్‌ను అధికారికంగా అందించారు. సామాజిక సేవాభావంతో ఆసుపత్రి అవసరాల కోసం అందించిన ఈ ఫ్రీజ్ రోగులకు, సిబ్బందికి ఉపయోగపడనుందని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. ఆసుపత్రి డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఆసుపత్రి అవసరాలను గుర్తించి ఫ్రీజ్‌ను అందించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు సామాజిక సేవకులు, దాతలు ముందుకు వచ్చి అవసరమైన వస్తువులు అందించడం ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందించవచ్చని చెప్పారు. సి.ఎల్. కాంత్ చేసిన సేవ ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొని సి.ఎల్. కాంత్‌ను అభినందించారు. సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టే వారు మరింత మంది ముందుకు రావాలని వారు ఆకాంక్షించారు.

# మండుతున్న ఎండలు... మృత్యువుకు ఎంత దగ్గరగా మనిషి?

ప్రకృతి వినాశనమే ఉష్ణోగ్రతల పెరుగుదలకు కారణమా?

కాలుష్యం, కాంక్రీట్ అడవులు... మండుతున్న భూమికి అసలు కారణాలు ఇవే"

"చెట్లు లేక వర్షాలు లేవు... నీటి కోసం భవిష్యత్తులో యుద్ధాలేనా?"

"ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే మానవ మనుగడకే ముప్పు"

"మండుతున్న భూమి... మెలకువ రాకపోతే మనిషి భవిష్యత్తు ప్రశ్నార్థకం"

"ప్రతి ఇంటి ముందు రెండు మొక్కలు... భవిష్యత్తుకు పచ్చని భరోసా"

చెట్లు లేక భవిష్యత్తు ప్రమాదంలో...

ఇప్పటికైనా మేల్కొనకపోతే మానవ మనుగడకే ముప్పు





**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 26 (వార్త సంధ్య) :** ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మానవాళికి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. గతంలో ఏప్రిల్, మే నెలల్లో మాత్రమే తీవ్రంగా అనిపించిన ఎండలు ఇప్పుడు మార్చి నుంచే ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో పలుచోట్ల ఇప్పటికే 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, భవిష్యత్తులో ఇవి 50 డిగ్రీలకుపైగా చేరే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకప్పుడు పచ్చని చెట్లు, అడవులు, చెరువులు, వ్యవసాయ భూములతో చల్లగా ఉండే ప్రాంతాలు ఇప్పుడు కాంక్రీట్ అడవులుగా మారిపోతున్నాయి. పట్టణీకరణ పేరుతో వేలాది చెట్లను నరికివేయడం, ప్రకృతి వనరులను ధ్వంసం చేయడం వల్ల భూమి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అడవులు తగ్గిపోవడం, వాహనాల కాలుష్యం, పరిశ్రమల నుంచి వెలువడే విషవాయువులు, ప్లాస్టిక్ వినియోగం వంటి అంశాలు గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణాలుగా మారాయి.

### 56 డిగ్రీల వద్ద మనుగడ కష్టమే

వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం మానవ శరీరం ఒక పరిమితి వరకు మాత్రమే అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోగలదు. 50 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదైతే వడదెబ్బలు, డీహైడ్రేషన్, గుండె సంబంధిత సమస్యలు పెరుగుతాయి. 55 నుంచి 56 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగితే సాధారణ జీవనం అసాధ్యమయ్యే పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే దేశంలోని అనేక రాష్ట్రాల్లో వడదెబ్బలతో మరణాలు నమోదవుతున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు, కూలీలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం సమయంలో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. విద్యుత్ వినియోగం పెరగడంతో పవర్ కట్స్ కూడా ప్రజలను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

### ఏసీలు కాదు... చెట్లే శాశ్వత పరిష్కారం

ప్రస్తుతం ప్రజలు వేడిని తట్టుకోవడానికి ఏసీలు, కూలర్లు వాడుతున్నా అవి తాత్కాలిక ఉపశమనం మాత్రమే. భారీగా విద్యుత్ వినియోగం పెరగడం ద్వారా మరింత వేడి ఉత్పత్తి అవుతోందని నిపుణులు చెబుతున్నారు. అసలు సమస్యకు పరిష్కారం చెట్ల పెంపకమేనని స్పష్టం చేస్తున్నారు. ఒక పెద్ద చెట్టు రోజుకు వందల లీటర్ల నీటిని ఆవిరి రూపంలో విడుదల చేసి పరిసర ప్రాంతాలను చల్లబరుస్తుంది. చెట్లు కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకుని ఆక్సిజన్ విడుదల చేస్తాయి. వర్షపాతం పెరగడంలో, భూగర్భ జలాల పరిరక్షణలో కూడా చెట్ల పాత్ర కీలకమని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు.

### "ప్రతి ఒక్కరూ కనీసం రెండు మొక్కలు నాటాలి"

ప్రస్తుతం ప్రారంభమవుతున్న వర్షాకాలం మొక్కలు నాటేందుకు అనుకూల సమయం. ప్రభుత్వం ఒక్కటే చేస్తుందని ఎదురు చూడకుండా ప్రతి కుటుంబం కనీసం రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. ఒక మొక్క పెద్ద చెట్టుగా ఎదగడానికి 5 నుంచి 7 సంవత్సరాలు పడుతుందని, ఇప్పుడే ప్రారంభిస్తేనే భవిష్యత్తులో ఫలితం ఉంటుందని చెబుతున్నారు.

### భవిష్యత్ తరాలకు పచ్చని భూమి అందిద్దాం

మన నిర్లక్ష్యం వల్లే ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందని, ఇకనైనా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి వృథాను ఆపడం, చెట్లు నాటడం, అడవులను కాపాడడం ద్వారా మాత్రమే రాబోయే తరాలకు జీవించే భూమిని అందించగలమని చెబుతున్నారు. "చెట్లే ప్రాణం... పచ్చదనమే మానవాళి భవిష్యత్తు" అంటూ పర్యావరణ కార్యకర్తలు ప్రజలకు పిలుపునిస్తున్నారు.

# వేతనం ఎక్కడ..? సేవలే మిగిలాయా..?

ఆర్థిక ఇబ్బందుల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు

నాలుగేళ్లుగా పెండింగ్‌లో రెంట్ బిల్లులు

ఇంతవరకు అందని ఏప్రిల్ నెల జీతాలు

అదనపు పనులతో పెరుగుతున్న పనిభారం

ప్రభుత్వ హామీలు అమలు కావాలంటూ టీచర్ల డిమాండ్






**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 25 (వార్త సంధ్య) :** రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలు అందిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, తమ సమస్యలు మాత్రం పరిష్కారం కాకపోవడంపై వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, ప్రాథమిక విద్య, గర్భిణుల సంరక్షణ వంటి కీలక బాధ్యతలను భుజాన వేసుకుని పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రస్తుతం జీతాలు, బిల్లులు, ఉద్యోగ భద్రత కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో వేలాది మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పనిచేస్తుండగా, నాలుగేళ్లుగా రెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇక ఏప్రిల్ నెలకు సంబంధించిన జీతాలు కూడా ఇప్పటివరకు అందకపోవడంతో కుటుంబాల పోషణ భారంగా మారిందని కార్యకర్తలు వాపోతున్నారు. నెల జీతాలపైనే ఆధారపడే అనేక కుటుంబాలు అప్పులు చేసి జీవనం సాగిస్తున్న పరిస్థితి ఉందని చెబుతున్నారు.

**పెరుగుతున్న పనిభారం.. తగ్గుతున్న ఆదరణ :**

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రీ-స్కూల్ విద్య అందించడం, పోషకాహార పంపిణీ చేయడం, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పర్యవేక్షణ చేయడం వంటి ప్రధాన బాధ్యతలతో పాటు పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అదనపు పనులను కూడా అంగన్‌వాడీ సిబ్బందికే అప్పగిస్తున్నారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల విధులు, సర్వేలు, ఆరోగ్య శిబిరాలు, డేటా సేకరణ, ప్రభుత్వ పథకాల ప్రచారం, ఇంటింటి తనిఖీలు వంటి అనేక పనులు అప్పగిస్తున్నప్పటికీ, అందుకు తగిన పారితోషికం లేదా ప్రోత్సాహం లేదని అంటున్నారు. పని భారం రోజురోజుకూ పెరుగుతుండగా, వేతనాలు మాత్రం సమయానికి అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కేసీఆర్ ప్రభుత్వంలో 15వ తేదీ లోపే జీతాలు వచ్చేవి :**

గత ప్రభుత్వ హయాంలో ప్రతి నెల 15వ తేదీ లోపే జీతాలు అందేవని, ప్రస్తుతం మాత్రం నెలలు గడిచినా జీతాల కోసం ఎదురుచూడాల్సి వస్తోందని అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు. రెంట్ బిల్లులు చెల్లించకపోవడంతో కేంద్రాల నిర్వహణ కూడా కష్టసాధ్యంగా మారిందని పేర్కొంటున్నారు. కొన్ని గ్రామాల్లో అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు యజమానులు ఒత్తిడి తెస్తున్నారని, బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కార్యకర్తలు చెబుతున్నారు.

**చిన్నారుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న అంగన్‌వాడీలు :**

గ్రామీణ ప్రాంతాల్లో పేద పిల్లలకు తొలి అక్షరాభ్యాసం అందించడంలో అంగన్‌వాడీలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. చిన్నారుల్లో పోషకాహార లోపాలను గుర్తించడం, గర్భిణులకు పోషకాహార సూచనలు ఇవ్వడం, బాలింతల ఆరోగ్యంపై అవగాహన కల్పించడం వంటి సేవలను అంకితభావంతో అందిస్తున్నారు. మహిళా శక్తికి అండగా నిలుస్తూ గ్రామీణ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, తమ సమస్యలపై ప్రభుత్వం సరైన దృష్టి సారించడం లేదని కార్యకర్తలు వాపోతున్నారు.

**సేవలకే పరిమితమైపోయిన ఉద్యోగ భద్రత :**

సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేకపోవడం, పదవీ విరమణ ప్రయోజనాలు లేకపోవడం అంగన్‌వాడీ కార్యకర్తల్లో ఆందోళన కలిగిస్తోంది. కనీస వేతనాలు, ఆరోగ్య భద్రత, బీమా సౌకర్యాలు, పెన్షన్ వంటి అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రభుత్వ హామీలు వెంటనే అమలు చేయాలి :**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కోరుతున్నారు. పెండింగ్‌లో ఉన్న రెంట్ బిల్లులు, జీతాలు వెంటనే విడుదల చేసి, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా ఖాళీ పోస్టులను భర్తీ చేసి, అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ముందుండే అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


# "రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై మహిళ ప్రసవం

## -- 108 స్పందించలేదు" అంటూ వచ్చిన ఆరోపణలపై ఆరోగ్యశాఖ విచారణ చేపట్టింది.

## ఈ ఆరోపణలు అవాస్తవం అని ప్రాథమిక విచారణలో తేలింది.



శ్రీమతి మహేశ్వరి (29 సంవత్సరాలు) 2026 మే 22న తొలుత తాండూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న సమయంలో, విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థన మేరకు 108 అంబులెన్స్ సేవలు తక్షణమే స్పందించాయి. ఆరోజు అర్ధరాత్రి సుమారు 12:30 గంటలకు 108 అంబులెన్స్ (టూ08ఖూ5645) ద్వారా ఆమెను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ (వీజు), తాండూరుకు సురక్షితంగా తరలించడం జరిగింది. తదుపరి అదే రోజు ఉదయం 9:28 గంటలకు, రోగి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వైద్యుడి పర్యవేక్షణలో 108 అంబులెన్స్ ద్వారానే మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్, తాండూరు నుంచి హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు సురక్షితంగా తరలించడం జరిగింది. అంటే, సంబంధిత మహిళకు అవసరమైన అత్యవసర వైద్య రవాణా సేవలను 108 వ్యవస్థ సమయానికి, సమర్థంగా అందించిన విషయం స్పష్టమవుతోంది. అయితే, గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో సంబంధిత మహిళ, వైద్యుల సూచనలకు విరుద్ధంగా లామా హాస్పిటల్ నుంచి వెళ్లిపోయారు. ఆమె స్వయంగా రైలులో తిరిగి తాండూరుకు ప్రయాణించినట్లు సమాచారం. 2026 మే 23 అర్ధరాత్రి సమయంలో తాండూరు రైల్వే స్టేషన్ సమీపానికి చేరుకున్న అనంతరం ఆమెకు ప్రసవ నొప్పులు ప్రారంభమై, స్టేషన్ ప్రాంగణంలో ప్రసవం జరిగినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో 2026 మే 23న తెల్లవారుజామున 1:06 గంటలకు 108 కాల్ సెంటర్‌కు కాల్ అందింది. కాల్ అందిన వెంటనే 108 వ్యవస్థ స్పందించి తాండూరు అంబులెన్స్‌ను పంపించే ప్రయత్నం చేశాం. అయితే, ఆ సమయానికి తాండూరు అంబులెన్స్ మరో అత్యవసర కేసు నిమిత్తం ఆదికిచర్ల గ్రామంలో సేవలందిస్తోంది. దీంతో ఆలస్యం లేకుండా సమీపంలో అందుబాటులో ఉన్న కొడంగల్ అంబులెన్స్‌ను ఈ కేసుకు కేటాయించడం జరిగింది. అదే సమయంలో కాల్ చేసిన వ్యక్తి మరియు అంబులెన్స్ బృందం మధ్య సమన్వయం కోసం కాన్ఫరెన్స్ కాల్ కూడా ఏర్పాటు చేయబడింది. అయితే, కొడంగల్ నుంచి అంబులెన్స్ చేరుకునే వరకు వేచి ఉండలేమని కాలర్ స్వయంగా తెలిపి, తల్లి మరియు నవజాత శిశువును ప్రైవేట్ వాహనం (ఆటో) ద్వారా తరలించినట్లు కాల్ రికార్డింగ్‌లో స్పష్టంగా నమోదైంది. కాబట్టి, "108 స్పందించలేదు" అనే ప్రచారం పూర్తిగా వాస్తవ విరుద్ధం. వాస్తవానికి, సంబంధిత మహిళకు ఇదే 108 సేవలు ఒకే రోజులో రెండు సార్లు అత్యవసర వైద్య రవాణా అందించాయి. అనంతరం వచ్చిన కాల్‌కూ తక్షణ స్పందన ఇచ్చి ప్రత్యామ్నాయ అంబులెన్స్‌ను ఏర్పాటు చేసినప్పటికీ, కాలర్ స్వయంగా వేచి ఉండకుండా ఇతర ఏర్పాట్లు చేసుకున్నారు. పూర్తి వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా 108 సేవలపై నిరాధార ఆరోపణలు ప్రచురించడం ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రమాదం ఉంది. అత్యవసర పరిస్థితుల్లో లక్షలాది మందికి ప్రాణాధారంగా నిలుస్తున్న 108 సేవలపై ఇలాంటి అసంపూర్ణ, ఏకపక్ష కథనాలు ప్రచురించే ముందు వాస్తవాలను నిర్ధారించుకోవాలని సంబంధిత మీడియా సంస్థలను కోరుతున్నాము.





# అంబేద్కర్ విగ్రహం తొలగింపు పై సర్పంచ్ ఆగ్రహం

**ఆర్ అండ్ బి అధికారుల తీరును తీవ్రంగా ఖండించిన సర్పంచ్**

**తొలగించిన చోటే మళ్లీ విగ్రహం ఏర్పాటు చేస్తాం**

**ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్ల దృష్టికి విషయం తీసుకెళ్తామని వెల్లడి**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 26 (వార్త సంధ్య) :** అశ్వాపురం మెయిన్ రోడ్డులో ప్రతిష్ఠించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆర్ అండ్ బి అధికారులు తొలగించడంపై సర్పంచ్ మచ్చ నరసింహారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజల సమక్షంలో అంబేద్కర్ విగ్రహాన్ని అశ్వాపురం మెయిన్ రోడ్డులో ఎంతో గౌరవంగా ప్రతిష్ఠించామని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత మేధావిగా గుర్తింపు పొందిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని అధికారులు తొలగించడం తీవ్రంగా ఖండనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విగ్రహాలు తొలగించినంత మాత్రాన అంబేద్కర్ గారి సేవలను, ఆయన చూపిన మార్గాన్ని ఎవరూ చెరపలేరు. ఇది మానవ సమాజానికి ప్రమాదకరమైన చర్య" అని వ్యాఖ్యానించారు. తొలగించిన అదే ప్రాంతంలో తిరిగి అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్ల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అధికారులు ప్రజల భావోద్వేగాలను గౌరవించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కుక్కకాటుతో మహిళ మృతి బాధాకరం

**బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి**

**వీధి కుక్కల నియంత్రణకు చర్యలు అవసరం**

**సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**





**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 26 (వార్త సంధ్య) :** లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ ఎస్సీ కాలనీకి చెందిన మారె రాములమ్మ (50) కుక్కకాటుతో మృతి చెందడం బాధాకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. సోమవారం మృతురాలి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోందని, ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే వీధి కుక్కల నియంత్రణకు అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

# బాల్యవివాహాలను నిర్మూలించాలి

- గుంజపడుగులో అవగాహన కార్యక్రమం



**మంథని , మే 26 వార్త సంధ్య ) :** బాల్య వివాహాలను నిర్మూలించాలని ఇందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని గుంజపడుగు గ్రామ సర్పంచ్ దండేవేనా సంధ్య భానేష్ కోరారు. మంగళవారం మంథని మండలం గుంజపడుగు గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాల సందర్భంగా బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దండేవేన సంధ్య బానేష్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన అమ్మాయిలకు 21 సంవత్సరాలు నిండిన అబ్బాయిలకు వివాహాలు చేయాలనే చట్ట నిబంధనను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. బాల్య వివాహాల వల్ల ఆడపిల్లల చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయని చిన్న వయసులోనే వివాహాలు చేయడం వలన తల్లి శిశువుకు ఆరోగ్యం ప్రమాదకరమన్నారు. అలాగే కుటుంబ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. ఈ మేరకు గుంజపడుగు గ్రామంలో అందరి సహాయ సహకారాలతో బాల్యవివాహాలను అడ్డుకోవాలని సర్పంచ్ గ్రామ ప్రజలను కోరారు. పిల్లలను చదివించాలని చట్టాలను గౌరవించాలని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మహిళా సాధికారత కేంద్ర కోఆర్డినేటర్ అరుణ, ఉప సర్పంచ్ ఎలుక లక్ష్మీ సదానంద, వార్డు సభ్యులు భోగే రాజేశ్వరి, దేవళ్ళ లక్ష్మీ, దొడ్డిపట్ల శంకర్, బోగే సంపత్తోపాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సొంత చెల్లి, బావ ఫోన్‌లు కూడా ట్యాప్ చేసిన కేటీఆర్ కు ఇందిరమ్మ పేరు పలికే అర్హత కూడా లేదు - మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ఇందిరమ్మ ఇండ్లపై కేటీఆర్ కు మంత్రి పొంగులేటి సవాల్**

**- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి -**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 26 :** సొంత చెల్లి, బావ ఫోన్‌లు కూడా ట్యాప్ చేసిన కేటీఆర్ కి ఇందిరమ్మ పేరు పలికే అర్హత కూడా లేదు అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర సంవత్సరాల్లోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నాం. ఇందిరమ్మ పాలన అంటే ఏంటో గ్రామాల్లోకి వెళ్లి ఇందిరమ్మ ఇండ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుంది కేటీఆర్ గారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుంది? జూన్ 1న మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి గారు శ్రీకారం చుట్టనున్నారు. హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నామని మే 23న జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించాం. రాజకీయ సన్యాసం తీసుకుంటా అంటున్న డ్రామారావు గారు... అసెంబ్లీ ఎన్నికల్లో మిమ్మల్ని ఓడగొట్టి, లోక్‌సభ ఎన్నికల్లో మీకు సున్నా సీట్లు ఇచ్చి, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానాల్లో కూడా మిమ్మల్ని ఓడగొట్టిన ప్రజలంతా.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కు ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నారు. మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనక్కర్లేదు! రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదు. డబుల్ బెడ్ రూం ఇండ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఓట్లు అడగకూడదు. సవాల్‌కు సిద్ధమేనా కేటీఆర్ ?

# 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక' ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**ఇంటింటి సర్వేతో 'ఇందిరమ్మ కుటుంబ జీవితం బీమా'**

**సర్వే పూర్తయిన ఇళ్లకు ప్రత్యేక లోగో స్టిక్కర్లు**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన**

**కేబినెట్ సబ్ కమిటి నిర్ణయం**





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 26 :** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడంతో, దాని ముగింపు వేడుకలను పురస్కరించుకుని జూన్ 2 నుండి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని కెబినెట్ సబ్ కమిటీ అధికారులను ఆదేశించింది. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటి సమావేశం జరిగింది. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు పాల్గొన్నారు.

**12 రోజుల పాటు విభిన్న కార్యక్రమాలు**

గ్రామ సభ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఇప్పటివరకు నిర్వహించిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాల ప్రగతిని సమీక్షించిన కేబినెట్ సబ్ కమిటి రాబోయే రోజుల్లో ప్రజా భాగస్వామ్యంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా జూన్ 02 నుండి 12 వరకు నిర్వాహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యంగా 'పర్యావరణ వారోత్సవం', రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, మహిళా-శిశు రక్షణ, గృహ నిర్మాణం, పర్యాటక ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, పునర్వినియోగ శక్తి (గ్రీన్ ఎనర్జీ) ప్రాజెక్టుల అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిర్వహించాలని నిర్దేశం చేశారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రులు స్పష్టం చేశారు.

**ప్రతి కుటుంబానికి 'ఇందిరమ్మ బీమా' రక్షణ**

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవితం బీమా' పథకం అమలుపై కేబినెట్ సబ్ కమిటి సుదీర్ఘంగా చర్చించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రులు పునరుద్ఘాటించారు.

**బీమా పథకం కీలక నిర్ణయాలు:**

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇల్లు కవర్ అయ్యేలా సమగ్ర గృహ స్థాయి డేటా సేకరణ జరపాలి. ఒకవేళ ఎవరైనా మిగిలిపోతే వారి కోసం ప్రత్యేక శిబిరాలు (స్పెషల్ క్యాంపులు) ఏర్పాటు చేయాలి. పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ బీమా పథకానికి ఒక విశిష్టమైన 'లోగో'ను రూపకల్పన చేయనున్నారు. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి ఈ లోగోతో కూడిన స్టిక్కర్లను అతికించనున్నారు. ఈ మేరకు అన్ని శాఖలు తమ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను (యాక్షన్ ప్లాన్) వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ రావు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిజిపి సి.వి ఆనంద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వికాస్ రాజు, నవీన్ మిత్తల్, వాణి ప్రసాద్, దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు సందీప్ కుమార్ సుల్తానీయా, గౌరవ్ ఉప్పల్, తదితర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో కాంగ్రెస్ శక్తి ప్రదర్శన

## కీలక సమావేశాలతో పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 26 ( వార్త సంధ్య ) :** కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్ల రోడ్డులోని క్రిస్టల్ ప్యాలెస్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కీలక రాజకీయ సమావేశాలు ఘన విజయాన్ని సాధించాయి. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షులు దీశీఎమ్రీ మీఘ్రవంష్ర ఖబమ్రితీ +శీబఒ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, గ్రామ స్థాయి నుంచి పార్టీ విస్తరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పొలిటికల్ అఫైర్స్ కమిటీ (గ్రూజ) సమావేశంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై పోరాట కార్యాచరణ, రాబోయే రాజకీయ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం జిల్లా డీసీసీ కార్యవర్గ సభ్యులకు ఆర్డర్ కాపీలను అందజేసి నాయకుల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు జిల్లా డీసీసీ అధ్యక్షుడు జుశ్రీవ మీఘ్రశ్రీఅమ్రితీయబఅ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. సభా ప్రాంగణం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కిక్కిరిసిపోవడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపించింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గాఘ్రఎఎఅతీ-చాశ్రీఅ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మీఘ్రఅ వీశీష్ఘ్రఅ ఞశీ, జుక్కల్ ఎమ్మెల్యే ఎష్ఘ్రశ్మీ గాఘ్రఎంష్రఎఅ ఖుత్ష్ఘ్ర ఞశీ, పీఏసీ సభ్యులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి నియోజకవర్గ సమస్యలపై జోనల్ కమిషనర్‌తో బండి రమేష్ భేటీ



**వార్తా సంధ్య కూకట్‌పల్లి:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ టిపిసిసి ఉపాధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ మరియు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బండి రమేష్ మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను ఆయన శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు ప్రజా సమస్యలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. అదేవిధంగా, బుధవారం నియోజకవర్గంలో ఇన్‌ఛార్జ్ మంత్రి శ్రీధర్ బాబు పర్యటించనున్న నేపథ్యంలో, ఏర్పాట్లు మరియు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా బండి రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాలి బాలాజీ, తూము వేణు, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, కొప్పుశెట్టి దినేష్, గంధము రాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఖైతలాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులి



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** ఖైతలాపూర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. బుధవారం అమృతనగర్ తండాకు చెందిన 62 మంది లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ జరగనున్న నేపథ్యంలో, అక్కడ కల్పించిన మౌలిక సదుపాయాలను ఆయన నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ చిత్తారమ్మ బస్తీ, ఖైతలాపూర్‌లలో మొట్టమొదటగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించామని గుర్తుచేశారు. గతంలో లాటరీ ద్వారా అమృతనగర్ తండా వాసులు 67 మందికి ఇళ్లు వచ్చాయని, మిగిలిన 62 మంది నిరుపేదలకు ఇప్పుడు ఇక్కడే ఇళ్లను కేటాయించామని తెలిపారు. స్థానిక ప్రజలకు 10 శాతం ఇళ్లను కేటాయించాలని, అలాగే అర్హులైన విలేకరులకు కూడా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు దక్కేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులకు ఎమ్మెల్యే కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. ఫతేనగర్‌లో అమృత నగర్ తండావాసులు ఖాళీ చేసిన ప్రభుత్వ స్థలంలో వారికే ఉపయోగపడేలా కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. ఒకవేళ ప్రభుత్వం నిర్మించని పక్షంలో, తన సొంత చొరవతో 'సీఎస్ఆర్' నిధుల ద్వారా తానే స్వయంగా కమ్యూనిటీ హాల్ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. నిరుపేదల విషయంలో రాజకీయాలు పక్కన పెట్టాలని హితవు పలికిన ఆయన.. ప్రజలకు మేలు జరుగుతుందంటే తాను ఎప్పుడూ పార్టీలకతీతంగా ముందుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబురావు, పండాల సతీష్ గౌడ్, తూము శ్రావణ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు బిక్షపతి, అంబటి శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్, ఎంఆర్ఓ స్వామితో పాటు ఇంజనీరింగ్, హౌసింగ్, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# దుబాయ్‌లో ఉద్యోగ అవకాశాలు.. జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 26( వార్త సంధ్య ) :** తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టుమాకామ్ ) ద్వారా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (దుబాయ్) లో వివిధ ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతున్నట్లు పెద్దపల్లి జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రిక్రూట్‌మెంట్‌ను తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా నిర్వహిస్తున్నారు. యుఏఇ లో టైల్ మేసన్స్, షట్టరింగ్ కార్పెంటర్, ఆర్‌సిసి వర్కర్, స్టీల్ ఫిక్సర్, స్కాఫోల్డర్, జనరల్ హెల్పర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు అవసరమని పేర్కొన్నారు. టెక్నికల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఏడిఈ 1453 (సుమారు ఐఎన్ఆర్ 37,800/-) జీతం, ఫుడ్ అలవెన్స్, అటెండెన్స్ బోనస్ కల్పించబడుతుందని, జనరల్ హెల్పర్ పోస్టులకు ఏడిఈ 1200 (సుమారు ఐఎన్ఆర్ 31,200/-) జీతం అందించబడుతుందని,అభ్యర్థులకు కనీసం 1 సంవత్సరం అనుభవం ఉండాలి ఫ్రెషర్స్ కూడా జనరల్ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థుల వయస్సు 18 నుండి 40 సంవత్సరాల మధ్య ఉండాలని, కంపెనీ వారే వసతి, రవాణా సదుపాయాలను కల్పిస్తారని, ప్రారంభ ఒప్పంద కాలం (కాంట్రాక్ట్) 2 సంవత్సరాలు ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు తమ నవీకరించిన రెజ్యూమేను శీఎ-షశీఎ.తీవంబఎవఏస్రమ్రిఅశ్రీ.షశీఎ కు పంపాలని సూచించారు. ?మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ ష్ష్ష్.శీఎషశీవ్.వశ్రీఖఅస్ఘ్రఅఖ.ష్రశీజ.ఱఅ ని సందర్శించవచ్చని, 8328602231, 9440050951 , 9440051452 ఫోన్ నంబర్ల నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# నేడు మంథని నియోజకవర్గ సమీక్ష సమావేశం

**- హాజరుకానున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు**

**- మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్**



**మంథని, మే 26 (వార్త సంధ్య) :** మంథని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం బుధవారం ఏర్పాటు చేయనున్నట్లు మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొట్ల తిరుపతి యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీనుబాబు హాజరుకానున్నారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం 5:30 గంటలకు మంథని పట్టణంలోని శివ కిరణ్ గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ, మండల, కమిటీ ఏర్పాటు పై సమీక్ష సమావేశం నిర్వహించబడునని, ఈ సమావేశానికి శ్రీను బాబు హాజరుకానున్నారని మంథని నియోజకవర్గంలోని అన్ని మండల పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, గ్రామ శాఖ అధ్యక్షులు, సింగిల్ విండో చైర్మన్ లు పార్టీ ముఖ్య నాయకులు, ఆశవాకులు తప్పనిసరిగా సమయానికి హాజరుకావాలని అయన కోరారు.

# బాల్య వివాహాలపై అవగాహన సదస్సు




**మంథని, మే 26 (వార్త సంధ్య) :** మంథని మండలం కన్నాల గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడి సెంటర్లో మంగళవారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు గ్రామస్తులకు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచి గుడిసె గట్టయ్య యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో యువతి యువకులకు మహిళలకు 18 సంవత్సరాలు యువకులకు 21 సంవత్సరాలు రానిదే వివాహాలు చేయవద్దని అలా చేసినచో గ్రామ పెద్దలు తల్లిదండ్రులు చట్టప్రకారం శిక్షించబడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ భాగ్యలక్ష్మి, వార్డు సభ్యులు ముసుకుల కృష్ణవేణి,రజిత,గ్రామ నాయకులు సంజీవరెడ్డి, కావటి సందీప్,ఆయా సునీత,అంగన్వాడీ పేరెంట్స్ పాల్గొన్నారు

# నేను నా కూతురిని కోల్పోయా.. మమతా బెనర్జీ 'కుర్చీ'ని కోల్పోయారు

**ఆర్జీ కర్ బాధితురాలి తల్లి**

**బెంగాల్ సీఎం సువేందు అధికారిని కలిసిన ఎమ్మెల్యే రత్న దేబ్‌నాథ్**

**మాజీ సీఎం మమతా బెనర్జీపై సోషల్ మీడియాలో తీవ్ర వ్యాఖ్యలు**

**ఆర్జీ కర్ కేసులో ముగ్గురు ఐపీఎస్ అధికారులను సస్పెండ్ చేసిన ప్రభుత్వం**

**సీబీఐ సిట్‌తో దర్యాప్తు చేయాలని గతంలోనే ఆదేశించిన కలకత్తా హైకోర్టు**

**కూతురికి న్యాయం జరగడమే తన ఏకైక లక్ష్యమని స్పష్టం చేసిన రత్న**



పశ్చిమ బెంగాల్‌ను కుదిపేసిన ఆర్జీ కర్ అత్యాచారం, హత్య కేసులో బాధితురాలి తల్లి, బీజేపీ ఎమ్మెల్యే రత్న దేబ్‌నాథ్ నిన్న సీఎం సువేందు అధికారిని కలిశారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశం అనంతరం ఆమె మాజీ సీఎం మమతా బెనర్జీ రాజకీయ ఓటమిని ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. 2024 ఆగస్టు 8-9 తేదీల మధ్య రాత్రి, కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో విధి నిర్వహణలో ఉన్న 31 ఏళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ రెసిడెంట్ డాక్టర్‌పై అత్యాచారం చేసి, దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై రత్న దేబ్‌నాథ్ కుమార్తె తల్లిగా న్యాయపోరాటం చేస్తూ, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పానిహటి నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. సీఎంతో భేటీ తర్వాత 'ఎక్స్'లో రత్న దేబ్‌నాథ్ ఒక పోస్ట్ చేశారు. "ఈరోజు నేను నబన్నా (సచివాలయం) 14వ అంతస్తులో ముఖ్యమంత్రితో సమావేశంలో ఉన్నాను. ఆయన పేరు సువేందు అధికారి. నిజాయతీకి ఉన్న శక్తి అపారం. అన్యాయంపై ఓపికగా పోరాడితే చాలు" అని పేర్కొన్నారు. "ఈరోజు నేనూ, మమత ఇద్దరం నష్టపోయాం. నేను నా ఏకైక కుమార్తెను కోల్పోయి ప్రజాసేవకు అంకితమయ్యాను. మమత 14వ అంతస్తులోని తన సీఎం కుర్చీని కోల్పోయారు" అని అన్నారు. మమత, ఆమె బృందం మరింత దారుణమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని, వేచి చూడండి అంటూ హెచ్చరించారు. సమావేశం అనంతరం రత్న దేబ్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యే అయినా తన జీవితంలో సంతోషం లేదని, కుమార్తెకు న్యాయం జరగడమే తన ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి తాను అనుమానిస్తున్న కొందరి పేర్లను ముఖ్యమంత్రికి అందజేశానని, గతంలో దర్యాప్తు అధికారులకు కూడా అవే పేర్లు ఇచ్చానని తెలిపారు. ఇదిలా ఉంటే.. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా ఏర్పడిన బీజేపీ ప్రభుత్వం ఈ కేసు విచారణను వేగవంతం చేసింది. ఆర్జీ కర్ ఘటన సమయంలో కీలక పదవుల్లో ఉన్న ఐపీఎస్ అధికారులు వినీత్ గోయల్, ఇందిరా ముఖర్జీ, అభిషేక్ గుప్తాలపై శాఖాపరమైన విచారణకు సీఎం సువేందు అధికారి ఆదేశించారు. విచారణ పూర్తయ్యే వరకు వారిని సస్పెండ్ చేశారు. కాగా, ఈ కేసు దర్యాప్తు కోసం సీబీఐతో ముగ్గురు సభ్యుల ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని కలకత్తా హైకోర్టు గతంలోనే ఆదేశించిన సంగతి తెలిసిందే.

# ముదిరాజ్ రిజర్వేషన్లపై జలవిహార్‌లో మేధోమథనం

**"ముదిరాజ్ సింహావలోకనం" సమావేశంలో**

**ఎస్ఈఈఈపీసీ నివేదికపై సమగ్ర చర్చ**

**ముదిరాజులకు న్యాయమైన రిజర్వేషన్లు**

**కల్పించాలని నేతల డిమాండ్**




**హైదరాబాద్, వార్త సంధ్య :** ముదిరాజ్ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో "ముదిరాజ్ సింహావలోకనం" పేరుతో హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఈ నెల 26న సమావేశం నిర్వహించారు. ముదిరాజ్ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు డాక్టర్ దినేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముదిరాజుల రిజర్వేషన్ అంశంతో పాటు ఎస్ఈఈఈపీసీ నివేదికపై విస్తృత స్థాయిలో మేధోమథనం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త కంచె ఐలయ్య మాట్లాడుతూ బీసీ వర్గాలలో ఎస్ఈఈఈపీసీ నివేదికపై సమగ్రంగా చర్చించిన తొలి సమావేశం ముదిరాజుల సమావేశమేనని అభిప్రాయపడ్డారు. అలాగే ఈ నివేదికను సమగ్రంగా విశ్లేషిస్తూ రూపొందించిన తొలి గ్రంథం "ముదిరాజుల ముఖచిత్రం" అని, ఆ పుస్తక రచయిత మరియు వేదిక గౌరవ సలహాదారు పిట్టల రవీందర్‌ను అభినందించారు. డాక్టర్ టి. చిరంజీవులు, ఐఏఎస్ మాట్లాడుతూ బీసీ వర్గాలన్నీ ఏకతాటిపైకి వచ్చి పాలనా అధికార సాధన దిశగా కృషి చేయాలని ముదిరాజ్ విద్యావంతులకు సూచించారు. ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ముదిరాజులు తమ న్యాయమైన వాటాను మాత్రమే అడుగుతున్నారని, అది తప్పా అని తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అన్ని రంగాలలో ముదిరాజులకు తగిన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బండ ప్రకాశ్ మాట్లాడుతూ ముదిరాజుల రిజర్వేషన్ అంశాన్ని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి తీసుకువచ్చి బీసీ కమిషన్‌కు అప్పగించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం కులాల జనాభా నివేదికలు కూడా సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో నిర్ణయం తీసుకుంటే కమిషన్ అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ఆహ్వాన సమన్వయకర్తగా జూలు నాగేశ్వర్ ముదిరాజ్, వందన సమర్పణగా కావలి చెన్నయ్య ముదిరాజ్ వ్యవహరించారు. మీడియా సమన్వయకర్తలుగా పిట్టల కిరణ్ ముదిరాజ్, పూల నాగరాజు ముదిరాజ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పరి నారాయణ ముదిరాజ్ సేవా సంఘం సమన్వయకర్త, డాక్టర్ పడిగే యాదగిరి ముదిరాజ్, కే. జగన్మోహన్ రావు ముదిరాజ్, జగన్ మోహన్ ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, శివకేశవులు, సైదులు, నూతి చలపతి, పెద్దబోయిన శ్రీనివాస్, వెంకటరమణ, చొక్కాల రాము (రాజన్న సిరిసిల్ల అధ్యక్షుడు), కోర్వి బాలకృష్ణ ముదిరాజ్, రాంబాబు, డి.ఎల్. పాండు, తెలంగాణ సంపత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాద ముఠాలకు యూపీ మంత్రుల సెల్‌ఫోన్ నంబర్లు!

**జాయిద్‌ఖాన్ కేసులో కొత్త విషయాలు వెలుగులోకి**

**నిందితుడితో చుట్టుపక్కల వారికి ఉన్న సంబంధాలపై పోలీసులు ఆరా**

**మేడ్చల్‌లోని ముబారక్ రెస్టారెంట్‌లో పని చేస్తూ విద్రోహశక్తులతో సంబంధాల గుర్తింపు**

**ఆదివారం నిందితుడు జాయిద్ ఖాన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు**




పాక్ ఐఎస్ఐ మద్దతుదారులతో మంతనాలు జరుపుతూ అరెస్టయిన జాయిద్ ఖాన్ ఆలియాస్ ఆదిలా ఖాన్ కేసులో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇతడితో చుట్టుపక్కల వారికి ఉన్న సంబంధాలపై ఆరా తీస్తున్నారు. మేడ్చల్‌లోని ముబారక్ రెస్టారెంట్‌లో పని చేస్తున్నజాయిద్ ఖాన్‌కు విద్రోహ శక్తులతో సంబంధాలున్నట్టు గుర్తించిన మేడ్చల్ పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జయిద్‌ఖాన్ తన రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా పలువురు ప్రజాప్రతినిధుల మొబైల్ నంబర్లు సేకరించి ఉగ్రవాదులకు పంపినట్లుగా దర్యాప్తులో పోలీసులు నిర్ధారించారు. ఈనెల 20వ తేదీన ఇంటర్నెట్‌లో యూపీ క్యాబినెట్ సభ్యుల ఫోన్ నంబర్లు వెతికి ఐఎస్ఐకి చేరవేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. జయిద్‌ఖాన్‌కు విద్రోహ శక్తులతో సంబంధాలున్నట్టు గుర్తించిన మేడ్చల్ పోలీసులు కొన్ని కీలక వివరాలు రాబట్టారు. ఉత్తర్‌ప్రదేశ్ ఘజియాబాద్‌కు చెందిన జాయిద్ ఖాన్ నాలుగో తరగతి వరకు చదివాడు. 2021లో కోల్‌కతా వెళ్లి దుస్తుల వ్యాపారి వద్ద సహాయకుడిగా పనిచేశాడు. మూడేళ్ల తర్వాత తిరిగి ఘజియాబాద్ చేరి రోహిత్ బ్యాగ్ హౌస్‌లో పనిచేశాడు. హైదరాబాద్‌లోని ముబారక్ రెస్టారెంట్‌లో సూపర్వైజర్‌గా పనిచేస్తున్న ఇతడి బంధువు ఫైజాన్ సూచనతో ఈ ఏడాది ఫిబ్రవరిలో అదే రెస్టారెంట్‌లో నెలకు రూ.15 వేల జీతంతో సర్వర్‌గా చేరాడు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్‌లో ఎక్కువ వ్యూస్ వచ్చేందుకు బొమ్మ తుపాకులు ప్రదర్శిస్తూ రీల్స్ రూపొందించి పోస్ట్ చేసేవాడు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో అసలైన తుపాకులు కోసం గూగుల్, ఇన్‌స్టాగ్రామ్‌లో వెతికాడు. తుపాకులు సరఫరా చేసే మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ఫోన్ నెంబర్ తెలుసుకొని అతడిని సంప్రదించాడు. ఫిబ్రవరిలో అతడు తన వద్ద ఉన్న దేశీయ పిస్టోళ్ల ఫొటోలు పంపాడని పోలీసులు తెలిపారు. ఆయుధాల పట్ల ఇష్టంతో ఇన్‌స్టాగ్రామ్‌లో అబిద్ జాట్, రాణా హుస్సేన్‌ను ఫాలో అయ్యాడు. ఆ ఇద్దరికి పాకిస్తాన్ గ్యాంగ్‌తో సంబంధాలున్నట్టు జాయిద్ ఖాన్ గ్రహించినట్లు పోలీసులు వెల్లడించారు. ఇంకా పాక్ గ్యాంగర్ షహజాద్ భట్టికి పాక్ ఐఎస్ఐ మద్దతున్నట్టు నిందితుడు తెలుసుకున్నాడు. ఏప్రిల్ 4న అబిద్ జాట్ సూచనతో ప్రయాగరాజ్‌కు చెందిన చోటా యోగి అనే వ్యక్తి లోకేషన్ వివరాలను జాయిద్ ఖాన్ వారికి షేర్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. తన మొబైల్ నెంబర్ కూడా వారికి పంపాడు. ఆ ఇద్దరి ఫోన్ నెంబర్లు తీసుకొని జాయిద్ ఖాన్ మెల్లగా మంతనాలు ప్రారంభించాడు. ఇతడి కంటెంట్‌కు క్రమంగా వ్యూస్ పెరగడంతో వారు చెప్పినట్టు చేసేందుకు సిద్ధమయ్యాడు. ఈ నెల 10న అబిద్ జాట్ తన ఫొటో కింద పాకిస్తాన్ డాన్ అబిద్ జాట్ పేరుతో వెయ్యి పోస్టర్లు తయారు చేసి ఘజియాబాద్‌లో అంటించాలని ఆదేశించారు. గోడలకు అంటించేటప్పుడు వీడియోలు తీసి తనకు పంపితే పిస్టల్ ఇస్తానని ఫోన్లో చెప్పటంతో నిందితుడు సిద్ధమయ్యాడని పోలీసులు తెలిపారు. తాను ఘజియాబాద్ వెళ్లినప్పుడు అంటిస్తానని అంగీకారం కుదుర్చుకున్నాడు. ఈ నెల 20న రాణా హుస్సేన్ నుంచి ఇతడికి యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వ్యక్తిగత సహాయకుడి మొబైల్ నెంబర్ ఇవ్వాలని ఆదేశం వచ్చింది. వాల్ పోస్టర్లు అంటించాలి : దీంతో ఇంటర్నెట్‌లో వెతికి యూపీ కేబినెట్ సభ్యుల ఫోన్ నెంబర్లు వారికి పంపాడు. తనకు ఆయుధం ఏర్పాటు చేయాలని రాణా హుస్సేన్‌ను అడిగితే రూ. 65 వేలు ఇస్తే పిస్టల్ ఇప్పిస్తానన్నట్లు తెలిపారు. తన వద్ద డబ్బులేదని చెప్పటంతో ఘజియాబాద్‌లో పోస్టర్లు అంటించాక పిస్టల్ తీసుకోవచ్చని ఆశ చూపారు. అబిద్ జాట్ మీమోస్, జాట్ 333 పేర్లతో ఉన్న వాట్సాప్ ఛానళ్లను ఇతడు ఫాలో అయ్యాడు. అనంతరం అబిద్ జాట్, రాణా హుస్సేన్‌లు నిర్వహిస్తున్న సోషల్ మీడియాలో గ్రూపుల్లో తనను చేర్చాలని కోరాడు. ఇస్లాం కోసం పోరాడేందుకు తనకు తుపాకీ కావాలని పదేపదే కోరాడని పోలీసులు పేర్కొన్నారు. అట్నుంచి వచ్చిన ఆదేశాలతో ఉత్తర్‌ప్రదేశ్‌తోపాటు దేశవ్యాప్తంగా పలువురు ప్రజాప్రతినిధుల ఫోన్ నెంబర్లు సేకరించి పాకిస్తాన్ ఐఎస్ఐకు చేరవేసినట్టు పోలీసుల దర్యాప్తులో నిర్ధరించారు.

# రాప్తాడు వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి సోదరుడి అరెస్ట్



అనంతపురం జిల్లా రాజకీయాల్లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. రాప్తాడు నియోజకవర్గ వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి సోదరుడు, ఆ పార్టీ నేత తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డిని అనంతపురం రూరల్ పోలీసులు ఈ ఉదయం అరెస్ట్ చేశారు. 2025లో చోటుచేసుకున్న తోపుదుర్తి గ్రామానికి చెందిన తోపుదుర్తి మహేశ్వర్ రెడ్డి అనే యువకుడి ఆత్మహత్య కేసు వ్యవహారంలో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. రాజశేఖర్ రెడ్డితో పాటు జైపాల్ రెడ్డి అనే మరో వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అనంతపురం డీఎస్పీ శ్రీనివాసులు అధికారికంగా ధ్రువీకరించారు. ఈ కేసు పూర్తి వివరాల్లోకి వెళితే... గతంలో మృతుడు మహేశ్వర్ రెడ్డి సామాజిక మాధ్యమాల్లో అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి వర్గానికి వ్యతిరేకంగా కొన్ని పోస్టులు పెట్టాడు. ఈ కారణంతో తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి సదరు యువకుడిని తీవ్రంగా బెదిరించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ బెదిరింపులను తట్టుకోలేకనే మహేశ్వర్ రెడ్డి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి మలిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజశేఖర్ రెడ్డి బెదిరింపులకు పాల్పడినట్లుగా చెబుతున్న కొన్ని ఆడియోలు, వీడియో ఆధారాలను కూడా ఆయన పోలీసులకు సమర్పించారు. ఈ ఘటనపై మొదట రైల్వే పోలీసులు కేసు నమోదు చేయగా, కేసు తీవ్రత దృష్ట్యా అనంతపురం రూరల్ పోలీసులు, రాప్తాడు పోలీసులు సంయుక్తంగా లోతైన విచారణ చేపట్టారు. ఈ విచారణలో లభించిన ఆధారాల ప్రాతిపదికన మంగళవారం ఉదయం నిందితులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, జైపాల్ రెడ్డిలను రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ అరెస్ట్ వ్యవహారం ఉమ్మడి అనంతపురం జిల్లా వైసీపీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.

## 'భారత్‌ను ట్రంప్ నరకం అన్నారు'
## అమెరికా విదేశాంగమంత్రికి ఊహించని ప్రశ్న!

**భారత్‌పై ట్రంప్ వ్యాఖ్యలపై రూబియోకు ప్రశ్న**

**ట్రంప్‌కు భారత్ అంటే ఇష్టమని రూబియో వివరణ**

**ఆన్‌లైన్ జాత్యహంకార వ్యాఖ్యలపై అమెరికా మంత్రి సీరియస్**

**భారతీయుల సహకారంపై రూబియో ప్రశంసలు**

**నాలుగు రోజుల భారత పర్యటనలో రూబియో**



ఢిల్లీలో జరిగిన ఓ మీడియా సమావేశంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు అమెరికన్ జర్నలిస్ట్ నుంచి ఊహించని ప్రశ్న ఎదురైంది. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో భారతీయులపై ఆన్‌లైన్‌లో జరుగుతున్న జాత్యహంకార దాడుల గురించి సదరు పాత్రికేయుడు ప్రశ్నించారు. ఈ క్రమంలోనే గతంలో భారత్ ఓ 'నరకం' అంటూ ట్రంప్ చేసిన పోస్ట్‌ను జర్నలిస్ట్ ప్రస్తావించగా రూబియో దానికి చాకచక్యంగా సమాధానమిచ్చారు. "ట్రంప్ అలా అనలేదు. ఆయనకు భారతదేశం అంటే ఎంతో ఇష్టం. నిన్న రాత్రి జరిగిన ఓ ఈవెంట్‌లోనూ ప్రధాని మోదీపై, భారత్‌పై ఆయన తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ట్రంప్‌కు ఇష్టం లేకపోతే నేను ఇక్కడికి వచ్చేవాడినే కాదు. ఆయనకు అత్యంత ఆప్తుడైన సెర్గియో గోర్‌ను భారత్‌కు రాయబారిగా పంపించేవారు కాదు" అని వివరించారు. ఆన్‌లైన్‌లో భారతీయులపై జరుగుతున్న జాత్యహంకార వ్యాఖ్యల గురించి రూబియో సీరియస్‌గా స్పందించారు. "ప్రతి దేశంలోనూ మూర్ఖులుంటారు. అలాంటి వారు అమెరికాలోనూ ఉన్నారు. ఇక్కడా ఉండొచ్చు. సోషల్ మీడియాలో ఎవరైనా ఏమైనా మాట్లాడొచ్చు. వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ప్రపంచం నలుమూలల నుంచి అమెరికాకు వచ్చి స్థిరపడిన భారతీయులు మా దేశాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. వారి సహకారాన్ని మేం ఎప్పుడూ గౌరవిస్తాం" అని రూబియో కొనియాడారు. గత ఏప్రిల్‌లో ఓ పాడ్‌కాస్టర్ భారత్‌ను తక్కువ చేస్తూ పెట్టిన వివాదాస్పద పోస్ట్‌ను ట్రంప్ తన సోషల్ మీడియాలో షేర్ చేశారు. అప్పట్లో ఈ అంశంపై భారత విదేశాంగ శాఖ గట్టిగానే స్పందించింది. ట్రంప్ పేరును నేరుగా ప్రస్తావించకుండా.. "ఈ తరహా వ్యాఖ్యలు భారత్-అమెరికా మధ్య పరస్పర గౌరవానికి, ద్వైపాక్షిక సంబంధాల వాస్తవికతకు అద్దం పట్టవు" అని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.

## గుల్మార్గ్‌లో గాలిలో 7 గంటలు.. 300 మంది పర్యాటకులను సురక్షితంగా కాపాడిన సైన్యం


**కశ్మీర్ గుల్మార్గ్ గొండోలాలో సాంకేతిక లోపం**

**గాల్లో చిక్కుకున్న 300 మందికి పైగా పర్యాటకులు**

**ఏడు గంటల పాటు శ్రమించి అందరినీ కాపాడిన బృందాలు**

**సైన్యం, ఎన్డీఆర్ఎఫ్, పోలీసులు పాల్గొన్న భారీ రెస్క్యూ ఆపరేషన్**

**సంఘటనపై విచారణకు ఆదేశించిన జమ్మూకశ్మీర్ ప్రభుత్వం**



జమ్మూకశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక కేంద్రం గుల్మార్గ్‌లో సోమవారం చోటుచేసుకున్న పెను ప్రమాదం నుంచి 300 మందికి పైగా పర్యాటకులు సురక్షితంగా బయటపడ్డారు. గొండోలా కేబుల్ కార్ సిస్టమ్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో, 65 క్యాబిన్లలో చిన్నారులు, మహిళలతో సహా పర్యాటకులు గంటల తరబడి గాల్లోనే చిక్కుకుపోయారు. సుమారు ఏడు గంటల పాటు సాగిన భారీ రెస్క్యూ ఆపరేషన్ అనంతరం అందరినీ క్షేమంగా కిందకు తీసుకురావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం మధ్యాహ్నం గుల్మార్గ్‌లోని గొండోలా మొదటి దశలో ఈ సాంకేతిక సమస్య తలెత్తింది. సమాచారం అందుకున్న వెంటనే భారత సైన్యం, జాతీయ, రాష్ట్ర విపత్తు నిర్వహణ దళాలు (చీణ=ఖీ, ూణ=ఖీ), స్థానిక పోలీసులు సంయుక్తంగా రంగంలోకి దిగాయి. ప్రతికూల వాతావరణం, బలమైన గాలుల మధ్య, కొన్ని క్యాబిన్లు నేలకు 500 అడుగుల ఎత్తులో వేలాడుతున్నప్పటికీ సహాయక బృందాలు ధైర్యంగా చర్యలు చేపట్టాయి. ప్రత్యేక తాడులు, అత్యాధునిక పరికరాలతో క్యాబిన్ల వద్దకు చేరుకుని, పర్యాటకులను ఒక్కొక్కరిగా సురక్షితంగా కిందకు దించారు. ఈ ఘటనపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందించారు. సాంకేతిక లోపంపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించినట్లు ఆయన తెలిపారు. "ఈ ఘటనను క్షుణ్ణంగా పరిశీలిస్తాం. లోపాలకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకుంటాం" అని ఆయన వివరించారు. సహాయక చర్యలను లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, డీజీపీ నలిన్ ప్రభాత్ దగ్గరుండి పర్యవేక్షించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా సహాయక బృందాల నైపుణ్యాన్ని, ధైర్యాన్ని ప్రశంసించారు. ముందుజాగ్రత్త చర్యగా, మే 26, 27 తేదీల్లో గొండోలా సర్వీసును పూర్తిగా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ రోజుల్లో టికెట్లు బుక్ చేసుకున్న వారికి పూర్తి నగదు వాపసు ఇవ్వనున్నట్లు తెలిపారు.

## రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు అండగా ఉంటా

**రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మారగోని యాదయ్య**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, వార్త సంధ్య :** రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని నూతనంగా ఎన్నికైన తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మారగోని యాదయ్య తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధిలో ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. కస్టమర్లు ప్లాట్లు కొనుగోలు చేసే దశ నుండి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు సేవలు అందించడంలో ఏజెంట్లు ముందుంటారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రియల్ ఎస్టేట్ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని, అయితే ఈ రంగం ద్వారానే ప్రభుత్వాలకు సుమారు 22 శాతం ఆదాయం వస్తోందని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని, రియల్టర్లు పెద్ద ఎత్తున సభ్యత్వం తీసుకొని అసోసియేషన్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రియల్ ఎస్టేట్ ఏజెంట్లు ఎక్కడా ఇబ్బందులకు గురికాకుండా చూసుకుంటామని, వ్యాపారంలో కమిషన్ ఎగ్గొట్టే వారి భరతం పడతామని హెచ్చరించారు. రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు సమాన న్యాయం జరిగే విధంగా తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ముందుంటుందని స్పష్టం చేశారు. జిల్లాలో రియల్టర్లకు ఎలాంటి కష్టాలు, సమస్యలు వచ్చినా అండగా నిలుస్తానని, కమిషన్ వివాదాలు, డబుల్ రిజిస్ట్రేషన్ వంటి అంశాల్లో రియల్టర్లకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని మారగోని యాదయ్య తెలిపారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఎస్‌బీఐ ఖాతాదారులకు గుడ్ న్యూస్

**సమ్మె వాయిదా, బ్యాంకింగ్ సేవలు యథావిధి**

**ఈరోజు మీరు చేయాల్సిన పనులేంటి**




దేశవ్యాప్తంగా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లు ఈరోజు, మే 26న యథావిధిగా పనిచేస్తున్నాయి. ప్రతిపాదిత సమ్మె వాయిదా పడటంతో కోట్లాది మంది ఖాతాదారులకు పెద్ద ఊరట లభించింది. దాదాపు అన్ని బ్యాంకింగ్ సేవలు ఇప్పుడు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. మీ ఆర్థిక లావాదేవీల కోసం ఎలాంటి ఆందోళన లేకుండా నేరుగా మీ బ్రాంచ్‌కు వెళ్లవచ్చు.ఆన్‌లైన్ బ్యాంకింగ్ వ్యవస్థలు, ఏటీఎంలు దేశవ్యాప్తంగా సాఫీగా నడుస్తున్నాయి. తక్షణ నగదు బదిలీ కోసం మీరు ఎప్పుడైనా యూపీఐ సేవలను వాడుకోవచ్చు. నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ సేవలు కూడా అందుబాటులోనే ఉన్నాయి. ఈ డిజిటల్ సదుపాయాల వల్ల బ్యాంకుకు వెళ్లకుండానే మీ పనులు పూర్తి చేసుకోవచ్చు. దీనివల్ల బ్యాంకుల్లో క్యూలో నిలబడాల్సిన అవసరం కూడా ఉండదు.సమ్మె రద్దు కావడంతో చెక్కుల క్లియరెన్స్ ప్రక్రియ ఎప్పటిలాగే కొనసాగుతుంది. ముఖ్యంగా ఈఎంఐ చెల్లింపులు సకాలంలో జరగడానికి ఇది చాలా కీలకం. చెక్కులు క్లియర్ కావడంలో ఆలస్యమైతే పెనాల్టీలు పడటమే కాకుండా క్రెడిట్ స్కోర్ కూడా దెబ్బతినే అవకాశం ఉంది. కాబట్టి, ఆటో-డెబిట్ చెల్లింపుల కోసం మీ ఖాతాలో తగినంత నగదు ఉండేలా చూసుకోండి. మీ ఈఎంఐ షెడ్యూల్‌ను సరిగ్గా పాటించడం వల్ల అనవసరమైన అదనపు ఛార్జీల భారం తప్పుతుంది.

| | |
|---|---|
| యూపీఐ, నెఫ్ట్ బదిలీలు | పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి |
| ఆర్‌టీజీఎస్, ఐఎంపీఎస్ సేవలు | పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి |
| నగదు, చెక్కు సేవలు | యథావిధిగా కొనసాగుతున్నాయి |

చాలా రాష్ట్రాల్లో బ్యాంకింగ్ కార్యకలాపాలు సాధారణంగానే ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో స్థానిక సెలవులు ఉండవచ్చు. త్రిపురలోని ఖాతాదారులు బ్రాంచ్‌కు వెళ్లే ముందు స్థానిక పనివేళలను ఒకసారి చెక్ చేసుకోవడం మంచిది. బ్యాంకులు తెరిచే ఉన్నప్పటికీ, ఈరోజు రద్దీ కాస్త ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. సమ్మె వార్తల నేపథ్యంలో పెండింగ్ పనుల కోసం జనం ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది కాబట్టి, సీనియర్ సిటిజన్లు మధ్యాహ్నం వేళల్లో వెళ్తే రద్దీ నుంచి తప్పించుకోవచ్చు.మీ పొదుపు, పెట్టుబడులను సమీక్షించుకోవడానికి ఈరోజు మంచి సమయం. ఎస్‌బీఐ ప్రస్తుతం సీనియర్ సిటిజన్లు, మహిళా ఇన్వెస్టర్ల కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను అందిస్తోంది. అలాగే మీ బ్యాంక్ ఖాతాను పోస్టాఫీసు పొదుపు పథకాలతో కూడా అనుసంధానించుకోవచ్చు. సురక్షితమైన రాబడి కోసం ఎఫ్‌డీలు ఎప్పుడూ మంచి ఆప్షన్. మీ అవసరానికి తగ్గట్టుగా సరైన కాలపరిమితిని ఎంచుకుని మెరుగైన వడ్డీని పొందండి.తాజా అప్‌డేట్స్ కోసం బ్యాంక్ అధికారిక మొబైల్ యాప్‌ను వాడుతూ ఉండండి. మీ లావాదేవీలకు సంబంధించిన డిజిటల్ రికార్డులను భద్రపరుచుకోవడం మంచి ఆర్థిక అలవాటు. ఈరోజు మీ బ్యాంకింగ్ పనులను పూర్తి చేసుకోవడం ద్వారా మీ ఆర్థిక ప్రణాళికలు సజావుగా సాగుతాయి. ఎస్‌బీఐ నెట్‌వర్క్ అంతటా మీ నగదు సురక్షితంగా ఉంటుంది, సేవలు నిరంతరాయంగా అందుతాయి. ఈ జాగ్రత్తలు పాటిస్తే మీ ఆర్థిక వ్యవహారాలను ప్రశాంతంగా చక్కబెట్టుకోవచ్చు.

# ఇంట్లో సిగరెట్ కాలుస్తున్నారా.. మీ పిల్లల ఆరోగ్యం ప్రమాదంలో ఉన్నట్టే!

**ప్యాసివ్ స్మోకింగ్‌తో చిన్నారుల ఆరోగ్యానికి తీవ్ర నష్టం**

**ఇంట్లో పొగతాగడం వల్ల పిల్లల్లో శ్వాసకోశ సమస్యలు అధికం**

**కిటికీ దగ్గర తాగినా ప్రమాదం తప్పదంటున్న వైద్య నిపుణులు**

**బట్టలు, ఫర్నిచర్‌పై నిలిచే 'థర్డ్ హ్యాండ్ స్మోక్' మరింత ప్రమాదకరం**



ఇల్లు... పిల్లలకు అత్యంత సురక్షితమైన ప్రదేశం. తల్లి వంటగదిలో చేసే వంటల సువాసన, పాత సోఫాలో దొరికే వెచ్చదనం, తల్లిదండ్రుల ఆప్యాయత... ఇవన్నీ వారికి భద్రతను ఇస్తాయి. కానీ, అదే ఇంట్లో సిగరెట్ పొగ రూపంలో ఓ నిశ్శబ్ద హంతకి వారి ఆరోగ్యాన్ని కబళిస్తోంది. సిగరెట్ ఆర్పేసినా దాని ప్రభావం గోడలు, కర్టెన్లలో నిలిచిపోయి చిన్నారుల ఊపిరితిత్తులను దెబ్బతీస్తోంది.భారత్‌లో పొగాకు వాడకం ఇప్పటికీ ఓ పెద్ద సవాలుగా ఉంది. గ్లోబల్ అడల్ట్ టొబాకో సర్వే ప్రకారం, లక్షలాది మంది భారతీయులు ఇళ్లలో, బహిరంగ ప్రదేశాల్లో ప్యాసివ్ స్మోకింగ్‌కు గురవుతున్నారు. దీనివల్ల తీవ్రంగా నష్టపోతున్నది చిన్నారులే. రాత్రి పూట పిల్లలు దగ్గితే 'బలహీనంగా ఉన్నార'ని, తరచూ ఛాతీ ఇన్ఫెక్షన్లు వస్తే 'వాతావరణం మారడం వల్లే' అని చాలామంది సరిపెట్టుకుంటారు. కానీ, అసలు సమస్య ఇంట్లోనే ఉందని గ్రహించలేకపోతున్నారు.ప్యాసివ్ స్మోకింగ్ అంటే కేవలం పొగ దగ్గర ఉండటం కాదని, పొగతాగని వారు ఇతరులు వదిలిన పొగను పీల్చడమని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మరెంగో ఏషియా హాస్పిటల్స్ మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ (బ్రిగేడియర్) ఏకే ధర్ మాట్లాడుతూ... "ప్రపంచవ్యాప్తంగా ఏటా 60 లక్షల మంది పొగాకు సంబంధిత కారణాలతో మరణిస్తున్నారు. ఇందులో 50 లక్షల మంది ప్రత్యక్షంగా పొగతాగడం వల్ల చనిపోతుంటే, మరో 5 లక్షల మంది ప్యాసివ్ స్మోకింగ్ వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు" అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 40 శాతం మంది పిల్లలు ప్యాసివ్ స్మోకింగ్‌కు గురవుతున్నారని ఆయన వివరించారు. చాలామంది కిటికీ దగ్గర, బాల్కనీలో లేదా పిల్లలు లేనప్పుడు సిగరెట్ తాగితే ప్రమాదం లేదనుకుంటారు. కానీ అది అపోహ మాత్రమేనని రాజీవ్ గాంధీ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్ కన్సల్టెంట్ డాక్టర్ కపిల్ గోయల్ హెచ్చరించారు. "పొగాకు పొగలోని విషపూరిత కణాలు, క్యాన్సర్ కారకాలు బట్టలు, ఫర్నిచర్, కర్టెన్లు వంటి వాటిపై పేరుకుపోతాయి. వీటిని 'థర్డ్ హ్యాండ్ స్మోక్' అంటారు. నేలపై ఆడుకునే పిల్లలు, వస్తువులను తాకినప్పుడు ఈ రసాయనాలు వారి శరీరంలోకి సులభంగా చేరతాయి" అని ఆయన వివరించారు.గాలిలో కనిపించే పొగ కన్నా ఇది మరింత ప్రమాదకరమని బీఎల్‌కే మ్యాక్స్ హాస్పిటల్ పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ సందీప్ నాయర్ తెలిపారు. ఎగ్జాస్ట్ ఫ్యాన్ కింద పొగతాగినా విష కణాలు గదులంతా వ్యాపించి సోఫాలు, పరుపులపై స్థిరపడతాయని, ఆడుకునే క్రమంలో పసిపిల్లలు వాటిని పీల్చడం లేదా మింగడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.పిల్లల ఊపిరితిత్తులు ఇంకా అభివృద్ధి చెందుతూ ఉంటాయి. పెద్దలతో పోలిస్తే వారి శ్వాస వేగం ఎక్కువగా ఉండటం వల్ల, శరీర బరువుకు తగినట్లుగా ఎక్కువ విష పదార్థాలను పీలుస్తారు. "పిల్లలు పెద్దలకు చిన్న రూపాలు కాదు. ప్యాసివ్ స్మోకింగ్ వల్ల వారిలో తీవ్రమైన ఆస్తమా, పదేపదే ఛాతీ ఇన్ఫెక్షన్లు, న్యుమోనియా వంటి సమస్యలు వస్తాయి" అని డాక్టర్ సందీప్ నాయర్ హెచ్చరించారు.టిలేషన్ లేకపోవడం వల్ల ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. పెద్దలను గౌరవించే సంప్రదాయం కారణంగా, ఇంట్లో పొగతాగే వారిని ఎవరూ ప్రశ్నించలేని పరిస్థితి ఉంటుంది. పిల్లల పోషణ, చదువుల కోసం వేలకు వేలు ఖర్చుపెట్టే కుటుంబాలు, తెలియకుండానే రోజూ వారిని పొగాకు విషానికి గురిచేస్తున్నాయి.ప్యాసివ్ స్మోకింగ్ నివారణకు పాక్షిక చర్యలు పనిచేయవని నిపుణులు తేల్చిచెబుతున్నారు. ఎయిర్ ఫ్రెషనర్లు విష రసాయనాలను తొలగించలేవు. ఫ్యాన్లు పొగను ఒకచోటి నుంచి మరోచోటికి వ్యాపింపజేస్తాయి. అందుకే ఇంటిని, కారును పూర్తిగా పొగ రహిత ప్రదేశాలుగా మార్చడమే ఏకైక పరిష్కారం. ఇంట్లో ఎవరూ పొగతాగకుండా చూడటం, పొగతాగే అలవాటు ఉన్నవారు దాన్ని మానేయడానికి సహాయం కోరడం చాలా ముఖ్యం. ఎందుకంటే, పిల్లలు తాము పీల్చే గాలిని ఎంచుకోలేరు. పెద్దలే వారి కోసం దాన్ని ఎంపిక చేస్తారు.

# దేశవ్యాప్తంగా మరోసారి సీఎన్జీ ధరల పెంపు

**11 రోజుల్లో కేజీకి రూ.6 భారం**

**మే 15 తర్వాత నాలుగోసారి సీఎన్జీ ధరల పెంపు**

**ఢిల్లీలో కేజీ సీఎన్జీ ధర రూ.83.09కు చేరిక**

**హార్మూజ్ జలసంధి ఉద్రిక్తతలు, ఇరాన్ యుద్ధ ప్రభావమే కారణమంటున్న సంస్థలు**




దేశవ్యాప్తంగా కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ ధరలను చమురు మార్కెటింగ్ సంస్థలు మరోసారి పెంచాయి. కిలోకు రూ.2 చొప్పున ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. తాజా పెంపు మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో కేజీ సీఎన్జీ ధర రూ.83.09కు చేరింది. గత 15 రోజుల వ్యవధిలో ఇది నాలుగోసారి ధరల పెంపు కావడం గమనార్హం. ఇప్పటికే మే 15న కిలోకు రూ.2, మే 18న రూ.1, మే 23న మరో రూ.1 చొప్పున జచీ+ ధరలు పెరిగాయి. తాజా పెంపుతో కలిపి గత 11 రోజుల్లోనే కేజీ సీఎన్జీపై మొత్తం రూ.6 భారం పడింది. వరుస ధరల పెంపులతో సీఎన్జీ వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం దేశవ్యాప్తంగా సహజవాయువు, ముడి చమురు ధరల్లో అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర అస్థిరత కొనసాగుతోంది. ముఖ్యంగా హార్మూజ్ జలసంధిలో సరఫరా అంతరాయాలు, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, ఇరాన్ యుద్ధ ప్రభావంతో చమురు, గ్యాస్ మార్కెట్లు ఒత్తిడికి గురయ్యాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలోనే చమురు మార్కెటింగ్ సంస్థలు వరుసగా ధరలు పెంచుతున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. సీఎన్జీ ధరల పెంపుతో ప్రధానంగా క్యాబ్ సేవలు, ఆటోరిక్షాలు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ రంగాలపై ప్రభావం పడనుంది. ముఖ్యంగా ఢిల్లీ వంటి నగరాల్లో భారీ సంఖ్యలో బస్సులు, క్యాబ్‌లు సీఎన్జీపై ఆధారపడుతున్నాయి. దీంతో నిర్వహణ వ్యయాలు గణనీయంగా పెరగనున్నాయి. ఈ అదనపు భారం చివరికి ప్రయాణికులపై పడే అవకాశముంది.ఇక మరోవైపు పెట్రోల్, డీజిల్ ధరలూ వరుసగా పెరుగుతుండటం సామాన్యులకు మరింత కష్టంగా మారింది. సోమవారం పెట్రోల్, డీజిల్ ధరలను కూడా చమురు సంస్థలు మరోసారి పెంచాయి. రెండు వారాల వ్యవధిలో ఇది నాలుగో పెంపు. తాజా సవరణ తర్వాత ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ.102.12కు చేరగా, డీజిల్ ధర రూ.95.20గా నమోదైంది. కోల్‌కతాలో పెట్రోల్ ధర రూ.113.51కు, డీజిల్ ధర రూ.99.82కు పెరిగింది. ముంబయిలో పెట్రోల్ లీటరు రూ.111.21 కాగా, డీజిల్ రూ.97.83కు చేరింది. చెన్నైలో పెట్రోల్ ధర రూ.107.77, డీజిల్ ధర రూ.99.55గా నమోదైంది. దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల్లోనూ ఇంధన ధరలు పెరగడం ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపుతోంది.ఇటీవల వరుసగా జరిగిన పెంపులను పరిశీలిస్తే, మే 15న పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.3 చొప్పున పెంపు చేశారు. ఆ తర్వాత మే 19న మరో 90 పైసలు పెంచగా, మే 23న పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు పెరిగాయి. ఇప్పుడు మరోసారి ధరలు పెరగడంతో రవాణా రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఇంధన ధరల పెరుగుదలతో లాజిస్టిక్స్ ఖర్చులు కూడా పెరిగే అవకాశం ఉంది. ట్రక్కులు, గూడ్స్ వాహనాల నిర్వహణ వ్యయాలు అధికమవడంతో నిత్యావసర వస్తువుల రవాణా ఖర్చు పెరుగుతుంది. ఫలితంగా కూరగాయలు, పాలు, ధాన్యాలు, ఇతర అవసర వస్తువుల ధరలపైనా ప్రభావం పడే అవకాశముందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ద్రవ్యోల్బణంపై కూడా ఈ ప్రభావం కనిపించవచ్చని భావిస్తున్నారు.అయితే వినియోగదారులపై భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఎక్సైజ్ సుంకాలను తగ్గించిందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గతంలో మార్చి 27న పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.10 చొప్పున తగ్గించినట్లు అధికారులు గుర్తుచేశారు. దీని వల్ల కేంద్రానికి సుమారు రూ.14 వేల కోట్ల ఆదాయ నష్టం వచ్చినప్పటికీ వినియోగదారులను రక్షించే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ అంతర్జాతీయ మార్కెట్లో కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితులు, ముడి చమురు ధరల హెచ్చుతగ్గులు, గ్యాస్ సరఫరా ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో సమీప భవిష్యత్తులో ఇంధన ధరలు మరింత పెరిగే అవకాశాన్ని నిపుణులు కొట్టిపారేయడం లేదు. దీంతో సామాన్య ప్రజలు, వాహనదారులు, రవాణా రంగం మరింత ఆందోళన చెందుతోంది.

# జీతం పెరిగితే కష్టాలు తీరవు.. బెంగళూరులో బతకాలంటే ఈ చిన్న మార్పులు చేయాల్సిందే!



ఈ రోజుల్లో బెంగళూరు లాంటి మెట్రో సిటీలో ఉద్యోగం చేయడం ఎంత క్రేజీగా ఉంటుందో.. నెలాఖరు వచ్చేసరికి ఖర్చుల లెక్కలు చూసుకుంటే అంతకంటే ఎక్కువ టెన్షన్ పుడుతుంది. ఐటీ హబ్‌గా పిలవబడే ఈ సిటీలో ఇళ్ల అద్దెలు, ఆటో ఛార్జీలు, వీకెండ్ పార్టీల ఖర్చులు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఎంత సంపాదించినా జీతం ఎటు పోతుందో తెలియక చాలా మంది తలలు పట్టుకుంటున్నారు. సరిగ్గా ఇలాంటి టైమ్‌లోనే అక్షయ్ సీఎన్ అనే బెంగళూరు యువకుడు ఇన్ స్టాగ్రామ్‌లో షేర్ చేసిన కొన్ని టిప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. "ఎక్కువ జీతం వస్తేనే ఆర్థిక సమస్యలు తీరవు.. మంచి అలవాట్లు ఉంటేనే డబ్బు మిగులుతుంది" అంటూ తను పాటించిన 7 సూత్రాలను అందరితో పంచుకున్నాడు.అక్షయ్ చేసిన మొదటి, అతిపెద్ద మార్పు ఏంటో తెలుసా ఆఫీస్ పక్కనో లేదంటే అందరూ మెచ్చే హైఫై ఏరియాలోనే ఇల్లు తీసుకోవాలనే రూల్ మార్చుకున్నాడు. దానికి బదులు మెట్రో స్టేషన్‌కు దగ్గరగా ఉండే ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. మొదట్లో అక్కడ రెంట్ కొంచెం ఎక్కువ అనిపించినా, లాంగ్ రన్‌లో అది అతనికి చాలా డబ్బు మిగిల్చింది. ప్రతిరోజూ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోకుండా, ఆటోల కోసం వందల రూపాయలు తగలేయకుండా మెట్రోలో హ్యాపీగా ప్రయాణించడం స్టార్ట్ చేశాడు. దీనివల్ల డబ్బుతో పాటు మానసిక ప్రశాంతత కూడా దొరికిందని చెప్తున్నాడు అక్షయ్.మనం చాలాసార్లు 50, 100 ఖర్చులే కదా అని లైట్ తీసుకుంటాం. కానీ, బెంగళూరు (దీవఅస్త్రుశ్రీబతీబ) లాంటి నగరాల్లో ఈ సౌకర్యాలే మన జేబులు ఖాళీ చేస్తున్నాయి. 10 నిమిషాల్లో వచ్చే క్విక్ డెలివరీలు, రోజువారీ ఆటో రైడ్స్, అవసరం లేకపోయినా కట్టే ఆన్‌లైన్ సబ్‌స్క్రిప్షన్లు.. ఇవన్నీ కలిపితే నెలాఖరుకు ఒక పెద్ద అమౌంట్ అయిపోతుందని అక్షయ్ గుర్తుచేశాడు. బద్ధకాన్ని పక్కన పెట్టి, ఈ చిన్న చిన్న ఖర్చులను కంట్రోల్ చేయడం వల్ల చాలా ఈజీగా మనీ సేవ్ చేయొచ్చని అంటున్నాడు.ప్లానింగ్ లేని వీకెండ్స్ వద్దు బాబోయ్!చాలా మంది ఐటీ ఉద్యోగులు శని, ఆదివారాలు వస్తే చాలు.. ఎలాంటి ప్లాన్ లేకుండా బయటకు వెళ్ళిపోతుంటారు. కనిపించిన కాఫీ షాపుల్లో దూరడం, పబ్బులు, రెస్టారెంట్ల చుట్టూ తిరగడం వల్ల జీతంలో సగం డబ్బులు అక్కడే కరిగిపోతాయి. అందుకే అక్షయ్ తన వీకెండ్స్‌ని ముందే ప్లాన్ చేసుకోవడం అలవాటు చేసుకున్నాడు. ఎక్కడికి వెళ్లాలి, ఎంత ఖర్చు పెట్టాలి అనే దానిపై ఒక క్లారిటీ ఉంటే అనవసరపు ఖర్చులు దానంతట అవే తగ్గిపోతాయి.బెంగళూరు వర్క్ కల్చర్‌లో ఒక రకమైన పీర్ ప్రెజర్ (తోటి ఉద్యోగుల ఒత్తిడి) ఉంటుంది. పక్క సీట్లో ఉన్నవాడు కొత్త ఐఫోన్ కొన్నాడనో, లేటెస్ట్ స్మార్ట్ వాచ్ పెట్టుకున్నాడనో మనం కూడా అనవసరంగా గ్యాడ్జెట్స్ అప్‌గ్రేడ్ చేస్తూ ఉంటాం. ట్రెండ్ కోసం ప్రాకులాడటం బంద్ చేస్తే మీ అకౌంట్ సేఫ్‌గా ఉంటుంది. అలాగే ప్రతిరోజూ హోటల్ ఫుడ్, ఆన్‌లైన్ ఆర్డర్లపై ఆధారపడకుండా, ఇంట్లోనే వండుకోవడం అలవాటు చేసుకున్నాడు అక్షయ్. ఇది అతని ఆరోగ్యంతో పాటు బ్యాంక్ బ్యాలెన్స్‌ను కూడా అద్భుతంగా పెంచేసింది.లైఫ్‌స్టైల్‌ను మార్చుకోకుండా, కాంప్రమైజ్ అవ్వకుండా కేవలం ఈ 7 చిన్న మార్పులతో బెంగళూరు (దీవఅస్త్రుశ్రీబతీబ) లాంటి కాస్ట్‌లీ సిటీలో కూడా హ్యాపీగా డబ్బులు మిగుల్చుకోవచ్చని అక్షయ్ నిరూపించాడు. నెటిజన్లు కూడా "నువ్వు చెప్పింది నూటికి నూరు పాళ్ళు నిజం బ్రదర్.. మేము కూడా ఇదే ఫాలో అవుతాం" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. మరి ఇంకెందుకు ఆలస్యం, ఈ టిప్స్ మీరు కూడా ట్రై చేయండి!

# ఆధార్ కీలక నిర్ణయం.. పాత 'ఎమ్ఆధార్' యాప్ బంద్

**అందుబాటులోకి క్యూఆర్ కోడ్, ఫేస్ అథెంటికేషన్**

**బయోమెట్రిక్ డేటాను లాక్ చేసే వెసులుబాటు**

**ఉచిత ఆధార్ అప్‌డేట్ గడువు పెంపు**




స్మార్ట్‌ఫోన్లలో ఆధార్ సేవలను ఉపయోగించే పౌరుల కోసం కేంద్ర ప్రభుత్వం కీలక మార్పును ప్రకటించింది. ఇప్పటివరకు అందుబాటులో ఉన్న పాత 'ఎమ్-ఆధార్' యాప్‌ను త్వరలోనే పూర్తిగా నిలిపివేయనున్నారు. దీని స్థానంలో మరింత భద్రత, ఆధునిక ఫీచర్లతో కూడిన సరికొత్త 'ఆధార్' యాప్‌ను భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) అధికారికంగా అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు వెంటనే కొత్త యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా ప్రభుత్వం కోరింది.పాత యాప్‌లో లాగిన్ లేదా అథెంటికేషన్ సమయంలో యూజర్ల పూర్తి వివరాలు స్క్రీన్‌పై కనిపించేవి. కానీ ఈ కొత్త యాప్‌లో డేటా ప్రైవసీకి అత్యంత ప్రాధాన్యమిచ్చారు. హోటళ్లు, ఆసుపత్రులు లేదా ప్రభుత్వ కార్యాలయాల్లో వెరిఫికేషన్ కోసం ఇకపై పూర్తి వివరాలను చూపించాల్సిన అవసరం లేదు. కేవలం యాప్‌లోని సురక్షిత క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా అవసరమైన సమాచారాన్ని మాత్రమే షేర్ చేయవచ్చు. అంతేకాకుండా కేవలం ఎస్ఎంఎస్ ఓటీపీలపైనే ఆధారపడకుండా రక్షణ కోసం ఫేస్ అథెంటికేషన్ (ఫేస్ ఐడీ), బయోమెట్రిక్ లాక్ వంటి అదనపు భద్రతా లేయర్లను ఇందులో చేర్చారు. వినియోగదారులు తమ వేలిముద్రలు లేదా ఐరిస్ డేటాను యాప్ ద్వారానే లాక్ లేదా అన్‌లాక్ చేసుకోవచ్చు.గూగుల్ ప్లే స్టోర్ లేదా యాపిల్ యాప్ స్టోర్ నుంచి అధికారిక 'ఘుఖస్త్రుఘుఖతీ' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.యాప్ ఓపెన్ చేసి మీకు నచ్చిన భాషను ఎంచుకోవాలి. ఆ తర్వాత మీ ఆధార్ కార్డ్‌కు లింక్ అయి ఉన్న మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేయాలి.మీ మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేసి వెరిఫై చేయాలి. సెటప్ ప్రక్రియలో భాగంగా కొన్నిసార్లు ఫేస్ అథెంటికేషన్ కూడా అడగవచ్చు.యాప్ సెక్యూరిటీ కోసం ఒక సురక్షితమైన పిన్ నంబర్‌ను క్రియేట్ చేసుకోవాలి లేదా బయోమెట్రిక్ అన్‌లాక్ ఎనేబుల్ చేసుకోవాలి.చివరగా ఆధార్ నంబర్‌ను జోడించి మరో ఓటీపీతో ప్రక్రియను పూర్తి చేయాలి.యాప్ మార్పుతో పాటు ఆధార్ వినియోగదారులకు యూఐడీఏఐ మరో తీపి కబురు అందించింది. 'మైఆధార్' పోర్టల్‌లో ఉచితంగా ఐడెంటిటీ, అడ్రస్ డాక్యుమెంట్లను ఆన్‌లైన్ ద్వారా అప్‌డేట్ చేసుకునే గడువును పొడిగించింది. నిజానికి ఈ ఉచిత సేవలు 2026 జూన్ 15 వరకే అందుబాటులో ఉండాల్సి ఉంది. కానీ తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం పౌరులు తమ వివరాలను 2027 జూన్ 14 వరకు ఎలాంటి రుసుము లేకుండా అప్‌డేట్ చేసుకోవచ్చు.








## ఈ వారం ఓటీటీల్లో ఎంటర్‌టైన్‌మెంట్ జాతర..

**ధనుష్ 'కర' నుంచి సత్య 'జెట్లీ' వరకు భారీ లైనప్!**

సినిమా ప్రేమికులకు ఈ వారం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు పూర్తి స్థాయి వినోదాన్ని అందించేందుకు సిద్ధమయ్యాయి. యాక్షన్ ఎంటర్‌టైనర్లు, క్రైమ్ థ్రిల్లర్లు, హారర్ కథలు, వెబ్ సిరీస్‌లు, డాక్యుమెంటరీలు ఇలా విభిన్న జానర్లతో ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. మే 25 నుంచి మే 31 వరకు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో స్ట్రీమింగ్ కానున్న సినిమాలు, సిరీస్‌లు మంచి ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

ధనుష్ 'కర'పై భారీ ఆసక్తి

ఈ వారం ప్రేక్షకుల దృష్టిని ఎక్కువగా ఆకర్షిస్తున్న చిత్రం కోలీవుడ్ స్టార్ ధనుష్ నటించిన 'కర'. దర్శకుడు విఘ్నేష్ రాజా తెరకెక్కించిన ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో మమితా బైజు కథానాయికగా నటించారు. థియేటర్లలో మిక్స్‌డ్ టాక్ అందుకున్నప్పటికీ ధనుష్ నటనకు మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా యాక్షన్ ఎపిసోడ్స్, క్లైమాక్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ చిత్రం మే 28 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది.

'లీడర్'తో వస్తున్న శరవణన్

ప్రముఖ వ్యాపారవేత్త, నటుడు లెజెండ్ శరవణన్ నటించిన 'లీడర్' కూడా ఈ వారంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఆర్ఎస్ దురై సెంథిల్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పాయల్ రాజ్‌పుత్, ఆండ్రియా, శ్యామ్, లాల్, బాహుబలి ప్రభాకర్ కీలక పాత్రలు పోషించారు. యాక్షన్ ప్రధానంగా రూపొందిన ఈ చిత్రం మే 29 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులోకి రానుంది.

ఓటీటీలోకి వచ్చిన సత్య 'జెట్లీ'

కమెడియన్ సత్య హీరోగా నటించిన తొలి ప్రధాన చిత్రం 'జెట్లీ' ఇప్పటికే ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. దర్శకుడు రితేష్ రానా తెరకెక్కించిన ఈ కామెడీ ఎంటర్‌టైనర్‌లో వెన్నెల కిశోర్, అజయ్, వైవా హర్ష తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. థియేటర్లలో ఆశించిన ఫలితం అందుకోలేకపోయిన ఈ సినిమా ఇప్పుడు జియో హాట్‌స్టార్‌లో కొత్త ప్రేక్షకులను ఆకర్షించేందుకు సిద్ధమైంది.

## స్టార్ హీరోతో ఆగిపోయిన మూవీ.. దెబ్బకు 9 సినిమాల నుంచి అవుట్..



సినీ రంగుల గ్లామర్ ప్రపంచంలో నటిగా ఓ గుర్తింపు తెచ్చుకోవడం అంత సులభమేమి కాదు. ఎన్నో సవాళ్లు.. మరెన్నో అడ్డంకులు దాటుకుని వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న తారలు చాలా మంది ఉన్నారు. అలాగే కెరీర్ మొదట్లోనే ఐరెన్ లెగ్ అనే ట్యాగ్ వచ్చిన హీరోయిన్స్ ఉన్నారు. కానీ ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న ఓ హీరోయిన్ మాత్రం తన తలరాతను మార్చుకుంది. ప్రస్తుతం బాలీవుడ్ ఇండస్ట్రీలో ఆమె స్టార్ హీరోయిన్. తక్కువ సమయంలోనే తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. ఎలాంటి బ్యాగ్రౌండ్ సపోర్ట్ లేకుండానే తనదైన ముద్ర వేసింది. కంటెంట్ ప్రాధాన్యత ఉన్న చిత్రాలను ఎంచుకుంటూ కోట్లాది మంది అభిమానుల హృదయాలు గెలుచుకుంది. అయితే కెరీర్ మొదట్లో ఒక స్టార్ హీరోతో సినిమా ఛాన్స్ వచ్చింది. కానీ అనుహ్యంగా ఆ మూవీ మధ్యలోనే ఆగిపోయింది. కట్ చేస్తే.. రాత్రికి రాత్రే ఆమెను 9 సినిమలా నుంచి తీసేశారంటూ ఆవేదన వ్యక్తం చేసింది.ఆమె మరెవరో కాదు.. హీరోయిన్ విద్యా బాలన్. కొన్ని రోజుల క్రితం ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. తన తొలి సినిమా రోజుల్లో తనను అపశకునం అని.. ఐరెన్ లెగ్ అని పిలిచారని.. అప్పట్లో ప్రతి రాత్రి తాను ఏడుస్తూ నిద్రపోయేదాన్ని అని చెప్పుకొచ్చారు. మలయాళీ స్టార్ హీరో మోహన్ లాల్ సరసన చక్రం అనే సినిమాలో తనకు ఛాన్స్ వచ్చిందని తెలిపింది. ఆ సినిమా కోసం దక్షిణాదిలో ఒక యాడ్ షూట్ జరుగుతున్నప్పుడు, తాను అక్కడికి వెళ్ళగా ఆ సినిమా కోసం ఆడిషన్ ఇవ్వమని తనను అడిగారని అన్నారు. హీరో మోహన్ లాల్ కావడంతో తాను వెంటనే ఒప్పుకున్నానని.. ఆడిషన్ అయిన వెంటనే దర్శకుడు తనను కలవాలనుకోవడంతో, తాను తన సోదరి, తల్లితో కలిసి అక్కడికి వెళ్ళానని విద్యా తెలిపింది. "నేను సినిమా మొదలుపెట్టాను, షూటింగ్ బాగా జరిగింది. 15 రోజుల తర్వాత వాళ్ళు నన్ను బొంబాయికి తిరిగి పంపించేశారు. మేము ఒక సీన్ చేశాము, వాళ్ళు షెడ్యూల్ పూర్తయిందని, మేము మొత్తం సినిమాను ఒకేసారి చిత్రీకరించాల్సి ఉందని చెప్పారు. మోహన్‌లాల్ సార్‌కు కొన్ని డేట్స్ సమస్యలు ఉన్నాయని, అందుకే మేము విరామం తీసుకుని వచ్చే నెలలో తిరిగి వస్తామని చెప్పారు. దర్శకుడికి, మోహన్‌లాల్‌కు సమస్యలు ఉండటంతో మేము చాలా రోజులు షూటింగ్ చేయలేదు. అందుకే ఇలాగే జరగాలేమో అని నేను అనుకున్నాను. అలా నేను సంతోషంగా బొంబాయికి తిరిగి వచ్చాను." "నేను ఒక స్టార్‌ని అని మనసులో అనుకుంటూ ఉండేదాన్ని. కానీ మోహన్‌లాల్ నటించిన 'చక్రం' సినిమా ఆగిపోతుందని నాకు అస్సలు తెలియదు. అది ఆగిపోయిన తర్వాత, నాకు ఆఫర్ చేసిన ఆ 8, 9 సినిమాలన్నీ నేను కోల్పోయాను. ఆ నటుడు, దర్శకుడు కలిసి 8 హిట్లు ఇచ్చారని, ఇప్పుడు వాళ్ళు తమ 9వ సినిమా చేస్తున్నారని అనుకున్నారు. అందుకే, బహుశా ఇది ఈ అమ్మాయి శక్తి వల్లేమో, ఈమెకు ఏదో అపశకునం తగిలిందేమో అన్నారు. అది ఒక పిచ్చి సమయం. చాలా నిరాశ కలిగించిన కాలం. ఈమెకు కనీసం ఒక్క సినిమా అయినా కలిసి రావాలని మా తల్లిదండ్రులు ప్రార్థించడం మొదలుపెట్టారు. నేను ఎదుర్కొంటున్న తిరస్కరణను, నిరాశను వాళ్ళు చూడగలిగారు. ఏడుస్తూ పడుకునేదాన్ని, కానీ ఆశ మాత్రం కోల్పోలేదు." అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె హిందీలో స్టార్ హీరోయిన్ గా దూసుకుపోతుంది.

## నమ్రతా శిరోద్కర్, సితారతో ప్రియాంకా చోప్రా.. ఇంతకీ ఎక్కడ కలిశారో తెలుసా..?



లబాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా ప్రస్తుతం ఎస్ఎస్ రాజమౌళి-మహేశ్ బాబు కాంబోలో రాబోతున్న వారణాసి సినిమాలో నటిస్తుందని తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్స్‌తో బిజీగా ఉంది. కాగా ప్రియాంకా చోప్రా నమ్రతా శిరోద్కర్, సితారతో కలిసి సందడి చేసింది. ఇంతకీ ఈ ముగ్గురూ కలిసింది ఎక్కడో తెలుసా..? సిటీలో ఉన్న వన్ ఆఫ్ ది హైఎండ్ మల్టీప్లెక్స్ ఏఎంబీ సినిమాస్‌లో. ఈ సందర్భంగా నమ్రతా, సితార, ప్రియాంకా చోప్రా కెమెరాకు ఫోజులిచ్చారు. దీనికి సంబంధించిన ఫొటో ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ప్రియాంకా చోప్రా ఆ తర్వాత ఏఎంబీ సినిమాస్ మేనేజ్ మెంట్, స్టాఫ్‌తో కూడా ఫొటోలు దిగింది. ఏఎంబీ సినిమాస్‌లో సందడి చేసిన విజువల్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. వారణాసి చిత్రంలో మందాకిని పాత్రలో కనిపించబోతుంది ప్రియాంకా చోప్రా. శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నవారణాసిలో మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. వారణాసి మూవీ ఫస్ట్ పార్ట్ 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.



## 'రాసి పెట్టుకోండి'.. పెద్దిపై రామ్ చరణ్ గూస్‌బంప్స్ స్పీచ్..!

రామ్ చరణ్ హీరోగా వస్తోన్న రూరల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా పెద్ది. బుచ్చిబాబు డైరెక్షన్‌లో వస్తోన్న ఈ మూవీ.. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. ఇ?ప్పటికే రిలీజైన ట్రైలర్‌కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ప్రస్తుతం ఈ మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే ఈ చిత్రంలోని స్పెషల్ సాంగ్‌ను కూడా విడుదల చేశారు. ఈ మూవ రిలీజ్ తేదీ దగ్గర పడడంతో పెద్ది హీరో రామ్ చరణ్ ప్రమోషన్లతో ఫుల్ బిజీ అయిపోయారు. తాజాగా బెంగళూరులో జరిగిన ఈవెంట్‌కు చెర్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్ది మూవీ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డానని రామ్ చరణ్ అన్నారు. ఈ మూవీ కోసం దాదాపు రెండన్నరేళ్ల పాటు ప్రాణం పెట్టి చేశానని చెర్రీ పంచుకున్నారు. అందరం కూడా కలిసికట్టుగా ఈ మూవీ కోసం శ్రమించామని పేర్కొన్నారు. రాసి పెట్టుకోండి.. ఈ సినిమా నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ అవుతుందని రామ్ చరణ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా.. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా కనిపించనుంది.



## థియేటర్లలో నిరాశపరిచిన 'జెట్ లీ'..

**ఇప్పుడు ఓటీటీలో అదృష్టం పరీక్షించుకోనున్న సత్య సినిమా**

ఈ ఏడాది టాలీవుడ్‌లో వేసవి సీజన్ ఆశించిన స్థాయిలో సందడి చేయలేకపోయింది. పెద్ద సినిమాలతో పాటు కొన్ని చిన్న చిత్రాలు కూడా ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ, వాటిలో చాలా వరకు బాక్సాఫీస్ వద్ద ప్రభావం చూపించడంలో విఫలమయ్యాయి. మంచి అంచనాల మధ్య విడుదలైన కొన్ని చిత్రాలు కూడా ప్రేక్షకులను పూర్తిగా ఆకట్టుకోలేక నిరాశపరిచాయి. అలాంటి సినిమాల్లో ప్రముఖ కమెడియన్ సత్య హీరోగా నటించిన తొలి చిత్రం 'జెట్ లీ' కూడా ఒకటి.తెలుగు సినీ పరిశ్రమలో తన కామెడీ టైమింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సత్య, హీరోగా ఎంట్రీ ఇస్తుండటంతో ఈ సినిమాపై మొదటి నుంచి మంచి ఆసక్తి నెలకొంది. అంతేకాకుండా సత్యకు కెరీర్‌లో కీలక బ్రేక్ ఇచ్చిన దర్శకుడు రితేష్ రానా ఈ చిత్రానికి దర్శకత్వం వహించడంతో అంచనాలు మరింత పెరిగాయి. కానీ విడుదల తర్వాత సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. కథ, కథనం విషయంలో కొత్తదనం ఉంటుందని భావించిన ప్రేక్షకులకు సినిమా పూర్తి స్థాయిలో కనెక్ట్ కాలేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీంతో బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఆశించిన వసూళ్లను రాబట్టలేకపోయింది. హీరోగా సత్య నటనకు ప్రశంసలు వచ్చినప్పటికీ, సినిమా మొత్తం పరంగా ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన లభించింది. ఇప్పుడు ఈ చిత్రం తన అదృష్టాన్ని ఓటీటీ వేదికపై పరీక్షించుకోడానికి సిద్ధమైంది. ప్రముఖ డిజిటల్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ జియో హాట్‌స్టార్ ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకుంది. మొదట ఈ సినిమాను ఒకే భాషలో విడుదల చేస్తారని వార్తలు వచ్చినా, తాజాగా తెలుగు ప్రేక్షకులతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. థియేటర్లలో అంతగా ప్రభావం చూపించలేకపోయిన అనేక సినిమాలు ఓటీటీలో మంచి ఆదరణ పొందిన ఉదాహరణలు గతంలో ఉన్నాయి. దీంతో ఇప్పుడు 'జెట్ లీ'కి కూడా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో కొత్త జీవితం దొరుకుతుందా? ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుందా? అన్న ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి సంగీతాన్ని కాలభైరవ అందించగా, ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. ఇప్పుడు థియేటర్లలో మిస్సైన ప్రేక్షకులు ఓటీటీ ద్వారా ఈ సినిమాను ఎంతవరకు ఆదరిస్తారనేది ఆసక్తికరంగా మారింది.


The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.